మంగళవారం 3 నవంబరు 2026

https://www.telugudesam.org






ముద్దాడ రవిచంద్ర చైర్మన్‌గా టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ నియామకం

- వివరాలు 2 లో..

వణికిస్తున్న 'మురసు'

- అర్ధరాత్రి నెల్లూరు–నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్
- విద్యా సంస్థలకు సెలవు
- పలు విమాన సర్వీసులు, రైళ్లు రద్దు



అమరావతి (చైతన్యరథం): పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర తుఫాను 'మురసు' ఏపీ తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం గంటకు 14 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఇది నెల్లూరు–నర్సాపురం మధ్య ఒంగోలుకు దక్షిణంగా సోమవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ సమయంలో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. కృష్ణా జిల్లా కోడూరు మండలం పాలకాయతిప్ప దగ్గర సముద్రం అల్లకల్లోలంగా మారింది. 500 మీటర్లకు పైగా ముందుకొచ్చింది. బాపట్ల సమీపంలోని సూర్యలంక వద్ద అలల ఉధృతి ఎక్కువగా ఉంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట తీరంలో అలలు 15 మీటర్ల ఎత్తున ఎగసిపడుతున్నాయి. నిజాంపట్నం పోర్టులో 10, మచిలీపట్నం పోర్టులో 9, కృష్ణపట్నం పోర్టులో 8వ నెంబరు ప్రమాద హెచ్చరికలు ఎగురవేశారు. తీర ప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లకూడదని అధికారులు స్పష్టం చేశారు.

కాగా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో పల్నాడు, నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేశారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, విశాఖ, కర్నూలు, ముంబై వెళ్లే 20 విమాన సర్వీసులను రద్దు చేశారు.

అర్నబ్‌తో పోలిస్తే 'మురసు' తీవ్రత తక్కువ

- దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీ వర్షాలకు అవకాశం
- సమర్ధ నీటి నిర్వహణతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



'మురసు' తుఫాను ప్రభావం అర్నబ్‌తో పోలిస్తే కోస్తాంధ్ర తీరంపై తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తుఫాను, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఉదయం ఆయన సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమీక్షించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగమంతా పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 50 టీఎంసీల మేర వరద ప్రవాహాలు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. తుఫాను వల్ల ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటితో చెరువులు, రిజర్వాయర్లను నింపేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

2

'మురసు'పై అప్రమత్తం

- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- పునరావాస కేంద్రాలు, తాగునీరు, రహదారుల పునరుద్ధరణపై దృష్టి పెట్టాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశం

- 48 గంటలపాటు అధికార యంత్రాంగం హై అలర్ట్
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి: హోం మంత్రి అనిత

- విద్యుత్ శాఖ సర్వ సన్నద్ధం కావాలి
- 48 గంటల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణే లక్ష్యంగా పని చేయాలి
- అవసరమైన సామగ్రి, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలి
- మూడు డిస్కంల సీఎండీలతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్

- ఆర్‌అండ్‌బీ శాఖ అప్రమత్తం
- రహదారులు, వంతెనల వద్ద నిరంతర పర్యవేక్షణ
- వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లో రాకపోకల నియంత్రణ
- అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాలు

- మున్సిపల్ యంత్రాంగం అలెర్ట్
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- హోర్డింగులు, భారీ వృక్షాల వద్ద ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు
- కమిషనర్లతో మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్

- వివరాలు లోపలి పేజీల్లో..

రాష్ట్రానికి త్వరితగతిన కేంద్ర సాయం అందేలా చూడండి

- అర్నబ్ తుఫాను నష్టంపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం
- రూ.4,526 కోట్ల సహాయానికి వినతి



3

అర్నబ్ తుఫాను వల్ల ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో రూ. 4,526 కోట్ల మేర నష్టం జరిగిందని, దీనికి సంబంధించిన నివేదికను ఇప్పటికే కేంద్రానికి సమర్పించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. తుఫాను నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కేంద్ర బృందం ప్రతినిధులతో సోమవారం ఆయన సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రంలో సమావేశమయ్యారు. కోనసీమ, పశ్చిమ గోదావరి, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో పర్యటించిన కేంద్ర బృందం.. వరి, కొబ్బరి, అరటి పంటలతో పాటు ఉద్యాన, ఆక్వా రంగాలకు జరిగిన తీవ్ర నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లింది. రాష్ట్రం తీవ్ర కరువు, తుఫాన్లను ఒకేసారి ఎదుర్కొంటోందని... ఆర్టీజీఎస్, వాట్సాప్ మనమిత్ర వంటి సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాణనష్టాన్ని తగ్గించగలిగామని సీఎం వివరించారు. పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసిన విధానాన్ని కేంద్ర బృందం ప్రశంసించింది.

రష్యాలో చిక్కుకున్న విశాఖ యువకులు

- సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టండి
- తన కార్యాలయ అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం



అమరావతి (చైతన్యరథం): రష్యాలో చిక్కుకు పోయిన ఇద్దరు విశాఖ యువకుల పరిస్థితిపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. విదేశాల్లో చిక్కుకుని స్వదేశానికి తిరిగిరాలేక ఇబ్బందులు పడుతున్న భారతీయుల పరిస్థితి హృదయ విదారకంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేష్... తన కార్యాలయం (@OfficeofNL) తక్షణం సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి, బాధిత యువకులకు అవసరమైన సహాయం అందించాలని కోరారు. యువకులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని, వారు త్వరితగతిన తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రత, వారి స్వదేశానికి సురక్షితంగా తిరిగి రావడం అత్యంత ప్రాధాన్యమని మంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.



అర్నబ్‌తో పోలిస్తే 'మురసు' తీవ్రత తక్కువ

- దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీ వర్షాలకు అవకాశం
- 50 టీఎంసీల మేర వరద ప్రవాహాలు వస్తాయని అంచనా
- సమర్ధ నీటి నిర్వహణతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- మురసు తుఫాను సన్నద్ధతపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్యరథం): కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలున్నాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్షించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. తుఫాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని చంద్రబాబు తెలిపారు.

అర్నబ్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఇప్పుడు మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను కారణంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 31వేల విద్యుత్ స్తంభాలను క్షేత్ర స్థాయికి పంపించామని అధికారులు వివరించారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని... వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు.

పల్నాడులో అత్యధిక వర్షపాతం అంచనా

మురసు తుఫాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 30, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రైన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అధికారులు అంచనా వేశారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉందని, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్‌లోని జలాశయాల్లో నీటిని నిల్వ చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మార్కాపురంలోని కంభం చెరువుతో పాటు ఆయా జిల్లాల్లోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలను కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు

మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకో వాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణులను తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి రెండు గంటలకు బులెటిన్

వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడి ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా హాజరయ్యారు.

ప్రజా సేవకుడు ఎర్రన్నాయుడు
వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి



అమరావతి(చైతన్యరథం): 'ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ... తెలుగుదేశం పార్టీలో బీసీ నేతగా, మచ్చలేని నాయకుడిగా రాజకీయాల్లో ప్రత్యేకత చాటుకున్నారు కింజరాపు ఎర్రన్నాయుడు. ఆయన అత్యంత ఆప్తుడైన ఆయన ప్రజా సేవను స్మరించుకుందాం' అంటూ ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు సామాజిక మాధ్యమం వేదికగా నివాళులర్పించారు.

ముద్దాడ రవిచంద్ర చైర్మన్‌గా
టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ నియామకం



తిరుపతి (చైతన్యరథం): తితిదే ట్రస్టు బోర్డు పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం 'స్పెసిఫైడ్ అథారిటీ'ని నియమించింది. ఈ మేరకు జీవో నం.658 విడుదల చేసింది. తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర చైర్మన్‌గా ఆర్థికశాఖ కార్యదర్శి వి వినయ్‌చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సభ్యులుగా అథారిటీని ఏర్పాటు చేసింది. కొత్త ట్రస్ట్ బోర్డు ఏర్పాటయ్యే వరకు లేదా ఏడాది పాటు ఈ స్పెసిఫైడ్ అథారిటీ కొనసాగుతుంది. తితిదే ధర్మకర్తల మండలికి ఉండే అన్ని అధికారాలూ దీనికి ఉంటాయి.

స్నేహానికి, ధైర్యానికి నిలువెత్తు నిదర్శనం... లక్ష్మి
- విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): 'రాప్తాడులో జరిగిన దారుణ దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ప్రజలంతా ప్రార్థిస్తున్నారు. ఈ సమయంలో తన స్నేహితురాలిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి పోరాడిన మరో బాలిక లక్ష్మి ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శం. ఒక ఉన్మాది రంపంతో పాఠశాలలోకి ప్రవేశించి దాడికి పాల్పడినప్పుడు లక్ష్మి భయపడి పారిపోలేదు. తన స్నేహితురాలిని కాపాడేందుకు ధైర్యంగా అడ్డుగా నిలబడింది. ఈ ప్రయత్నంలో తాను కూడా తీవ్రంగా గాయపడింది. తనను తాను కాపాడుకునే అవకాశం ఉన్నా, స్నేహితురాలిని రక్షించేందుకే ప్రయత్నించింది. నిజమైన స్నేహానికి, అసలైన ధైర్యానికి లక్ష్మి నిలువెత్తు నిదర్శనం. ప్రస్తుతం ఇద్దరు బాలికలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కష్ట సమయంలో రెండు కుటుంబాలకు మా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. ఇద్దరు విద్యార్థినులకు అత్యుత్తమ వైద్యం అందేలా చూస్తాం. రాష్ట్రంలో ఏ చిన్నారి కూడా తరగతి గదిలో భయపడాల్సిన పరిస్థితి రాకుండా పాఠశాలల్లో భద్రతను మరింత పటిష్ఠం చేస్తాం. ఇద్దరు బాలికలు త్వరగా కోలుకుని, మళ్లీ చిరునవ్వులతో పాఠశాలకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.' అంటూ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

ఆ వార్త ఎంతో సంతోషం కలిగించింది

'ఈ రోజు ఉదయాన్నే ఎంతో సంతోషాన్ని కలిగించే వార్తను బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రి వైద్యులు అందించారు. రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది. వైద్యుల సూచనలను అర్థం చేసుకుని స్పందిస్తోంది. నాకే కాదు, ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్న ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో శుభవార్త. బాలిక త్వరగా పూర్తిగా కోలుకుని, చిరునవ్వులతో మన ముందుకు రావాలని లోకేష్ మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

చైతన్యరథం

రాష్ట్రానికి త్వరితగతిన

కేంద్ర సాయం అందేలా చూడండి

- అర్నబ్ తుఫాను నష్టంపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు
- నాలుగు జిల్లాల పర్యటన వివరాలను వెల్లడించిన కేంద్ర బృందం సభ్యులు
- రాష్ట్ర ప్రభుత్వ తక్షణ స్పందన, సహాయక-పునరుద్ధరణ చర్యలపై ప్రశంసలు



అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని, కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర బృందాన్ని కోరారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, దీనికి సంబంధించిన నివేదికను ఇప్పటికే కేంద్రానికి సమర్పించామని చెప్పారు. తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. కేంద్ర హోం, వ్యవసాయం, జలవనరులు, జాతీయ రహదారులు, ఆర్థిక విభాగాలకు చెందిన అధికారులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదిక సమర్పించిన వెంటనే... నష్టం అంచనాకు కేంద్రబృందం రాష్ట్రంలో పర్యటించడంపై ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన సిఫార్సులు సమర్పించాలని కోరారు. కేంద్రం నుంచి సత్వర ఆర్థిక సాయం అందితే రాష్ట్రానికి ఎంతో ఊరట కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అర్నబ్ తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు కోనసీమ, పశ్చిమ గోదావరి, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో పర్యటించిన విషయాన్ని కేంద్ర బృందం సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ జిల్లాల్లో తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్టు కేంద్ర బృందం అధికారులు సీఎంకి వివరించారు. తుఫాను ప్రభావంతో వరి, కొబ్బరి, అరటి వంటి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్టు కేంద్ర బృందం గుర్తించింది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించింది. ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను తీవ్రత కారణంగా రైతులకు నష్టం మరింత పెరిగిందని బృందం సభ్యులు తెలిపారు.

ఓవైపు కరువు... మరోవైపు తుఫాన్లు

వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన, ఆక్వా కల్చర్ వంటి వాణిజ్యపంటలు కూడా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు.మత్స్యకారుల పడవలకు సైతం నష్టం వాటిల్లిందన్నారు. అర్నబ్ తుఫాను మిగిల్చిన నష్టంనుంచి ఇంకాకోలుకోకముందే మురసు తుఫాను రాష్ట్రాన్ని తాకుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. హుద్ హుద్, తిత్లీ, మోంథా వంటి తుఫాన్లు గతంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టాన్ని కలిగించాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఒక ప్రాంతం ఎల్‌నినో వల్ల తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటుండగా, మరో ప్రాంతం తుఫాన్ల ప్రభావానికి గురవుతోందన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకే ఉద్యానపంటలవైపు మళ్లుతున్నామని, తుఫాన్లను ఎదుర్కొనేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నామని సీఎం చెప్పారు. రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంతోపాటు వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను అనుసంధానం చేయడం ద్వారా తుఫాను సమయంలో ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగామని ముఖ్యమంత్రి కేంద్ర బృందానికి వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆర్టీజీఎస్, వాట్సాప్ మనమిత్ర కీలకంగా వ్యవహరించాయని కేంద్ర బృందం అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాలకు కూడా సిఫార్సు చేస్తామని కేంద్ర బృందం తెలిపింది.

పునరుద్ధరణ చర్యలపై నిరంతర పర్యవేక్షణ

తుఫాను కారణంగా విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని కేంద్ర బృందానికి సీఎం వివరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం 7వేల మంది సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినట్టు వెల్లడించారు. పునరావాసం, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులను ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు, సహాయక చర్యలు-పునరుద్ధరణ పనులకు చేసిన కృషిని కేంద్ర బృందం ప్రశంసించింది. ముఖ్యంగా విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంది.మారుమూల ప్రాంతాల్లో సైతం ఈ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించింది.

పోలీసు వ్యవస్థలో అద్భుత సంస్కరణలు అమలు చేశారు

రిటైర్డ్ ఐపీఎస్ బాలసుబ్రమణ్యం భౌతికదేహానికి సీఎం చంద్రబాబు నివాళులు

విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని సిటీ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) గ్రౌండ్స్‌లో రిటైర్డ్ ఐపీఎస్, విశ్రాంత ఐజీ బాలసుబ్రమణ్యం భౌతికదేహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించి నివాళులర్పించారు. ఆయన బాలసుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ బాలసుబ్రమణ్యం మరణం అత్యంత బాధాకరమని... సర్వీసు నుంచి రిటైరైన రెండు నెలలకే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడం విచారకరమన్నారు. క్యాన్సర్ వ్యాధితో పెద్ద యుద్ధమే చేసిన బాలసుబ్రమణ్యం చికిత్స పొందుతూనే తన విధులను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఆయన తీవ్రంగా బాధపడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆర్టీసీ ఎండీగా సమర్థవంతంగా పనిచేసిన బాలసుబ్రమణ్యం మూడు దశాబ్దాల పాటు పోలీస్ శాఖలో అనేక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారన్నారు. ఉమ్మడి ఏపీలో జగిత్యాల ఎస్పీగా అనేక సమస్యాత్మక ప్రాంతాల్లో సేవలు అందించారని తెలిపారు. సాంకేతికతపై ప్రత్యేక ఆసక్తి ఉన్న బాలసుబ్రమణ్యం పోలీసు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఈ-ప్రగతి వ్యవస్థ ద్వారా అద్భుతమైన సంస్కరణలు అమలు చేశారని సీఎం గుర్తు చేశారు. ప్రతి విభాగంలోనూ తనదైన ముద్ర వేసి పోలీసు శాఖకు వన్నె తెచ్చిన ప్రజాహిత అధికారి బాలసుబ్రమణ్యం ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.









పంటల బీమా రైతులకు శ్రీరామరక్ష

- ఇన్‌పుట్ సబ్సిడీకి తోడు బీమా పరిహారమూ దక్కాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- టెలికాన్ఫరెన్స్‌లో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మార్గనిర్దేశం



అమరావతి (చైతన్యరథం): విపత్తులు సంభవించిన సమయంలో రైతులకు పంటల బీమా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, ప్రతి రైతుకు బీమా పరిహారం అందేలా అధికారులు చొరవ చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, పంటల బీమా కంపెనీల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమాపై అవగాహన కల్పించేందుకు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

ముఖ్యమంత్రి సమీక్షలోని ప్రధానాంశాలు:

రైతులకు రెట్టింపు వెసులుబాటు: విపత్తుల సమయంలో రైతులకు ప్రభుత్వం రూ.25వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తోందని, దీనికి బీమా పరిహారం కూడా తోడైతే వారికి ఆర్థికంగా మరింత ఊరట లభిస్తుందని సీఎం తెలిపారు.

రెండు రకాల బీమా పథకాలు: రాష్ట్రంలో ప్రస్తుతం 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన'తో పాటు ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహార బీమా కూడా అమలు చేస్తున్నట్టు వివరించారు.


కలెక్టర్ల చొరవ అవసరం: ఈ ఏడాది పెద్ద ఎత్తున క్రాప్ ఇన్సూరెన్స్ చేయించామని, కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకుంటేనే రైతులకు పూర్తి ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. బీమా క్లెయిమ్‌ల విషయంలో రైతులకు పూర్తి అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కౌలు రైతులకూ లబ్ధి: బీమా అనేది ప్రతి రైతుకు అలవాటుగామారితే ఆర్థికనష్టాల నుంచి గట్టెక్కవచ్చని, సొంత రైతులతోపాటు కౌలుదారులు కూడా నష్టపోకుండా ఇదిఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు.

పంట నష్టంపై తక్షణ అంచనాలు: 'అర్నబ్' తుఫాను వల్ల శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు తీవ్ర పంట నష్టం జరిగిందన్నారు. రానున్న 'మురసు' తుఫాను వల్ల దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పంటలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని సీఎం తెలిపారు. ఈ నష్టంపై వ్యవసాయ శాఖ త్వరితగతిన అంచనాలు రూపొందించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రాణ నష్టం జరగకుండా చూడాలి

- అధికారులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- తీరం దాటే వరకు ప్రజలు బయటకు రావద్దని హెచ్చరిక
- నేడు 125 మండలాల్లో భారీ వర్ష సూచన



అమరావతి (చైతన్యరథం): ఏపీ తీరం వైపు వేగంగా దూసుకొస్తున్న 'మురసు' తుఫాను సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోమవారం రాత్రి మరోసారి అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, అధికారుల ముందస్తు ఏర్పాట్లపై సీఎం సమగ్రంగా సమీక్షించారు. తుఫాను ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం వద్ద తెల్లవారుజామున తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

ఒక్క ప్రాణం కూడా పోవడానికి వీల్లేదు: 'గతంలో వచ్చిన అర్నబ్ తుఫాను సమయంలో ప్రాణనష్టాన్ని నివారించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నప్పటికీ కొందరి ప్రాణాలను కాపాడుకోలేకపోయాం. కానీ 'మురసు' తుఫాను విషయంలో అలాంటి సంఘటనలు పునరావృతం కావడానికి వీల్లేదు. సున్నా ప్రాణనష్టమే లక్ష్యంగా యంత్రాంగం పని చేయాలి' అని సీఎం స్పష్టం చేశారు.

ప్రజలు బయటకు రావొద్దు: తుఫాను తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకుండా అధికారులు కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమాచారాన్ని క్షేత్రస్థాయికి చేరవేసేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బందిని పూర్తిగా భాగస్వామ్యం చేయాలన్నారు.

విద్యుత్ విభాగానికి అలెర్ట్: అర్నబ్ తుఫానుతో పోల్చితే గాలుల వేగం కొంత తక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్ సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్తంభాలు కూలినా లేదా సరఫరాకు అంతరాయం ఏర్పడినా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు.

రక్షణ చర్యలు: కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆస్తి నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించేలా చర్యలు ఉండాలని సూచించారు.

నేడు 125 మండలాల్లో భారీ వర్షాలు: రాష్ట్రంలో మంగళవారం వర్షాల ప్రభావం అత్యధికంగా ఉంటుందని సీఎం తెలిపారు. మొత్తంగా 125 మండలాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో చిరుజల్లులు, ఒంగోలు ప్రాంతంలో మోస్తరు వర్షం పడుతోందని, తీరం దాటే కొత్తపట్నం పరిసరాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయని సంబంధిత జిల్లాల కలెక్టర్లు ముఖ్యమంత్రికి నివేదించారు.

ఏపీ ప్రభుత్వ సంచలన నిర్ణయం

- అసైన్డ్, చుక్కల భూములపై కీలక ఉత్తర్వులు
- ఫ్రీహోల్డ్ దరఖాస్తుల పరిష్కారానికి కాలపరిమితి విధింపు
- జీవో నెం.659 జారీ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములకు సంబంధించి ఫ్రీహోల్డ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ జీవో నెం.659 జారీ చేసింది.

ముఖ్యమైన నిర్ణయాలు, కాలపరిమితులు: తహసీల్దారు వద్దకు వచ్చే ఫ్రీహోల్డ్ దరఖాస్తులను గరిష్ఠంగా 60 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్డీవో పరిధిలోని దరఖాస్తులకు కూడా 60 రోజుల గడువును నిర్ణయించారు. నిర్దిష్ట కేటగిరీకి చెందిన దరఖాస్తులను 30 రోజుల్లోనే పరిష్కరించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో అప్లై చేసిన వెంటనే ఆ దరఖాస్తు సంబంధిత తహసీల్దారు లాగిన్‌కు చేరేలా సాంకేతిక మార్పులు చేశారు.

రిజిస్ట్రేషన్ ప్రాసెస్ మరింత సులభం:

భూమికి సంబంధించి 'వెబ్‌ల్యాండ్'లో ఫ్రీహోల్డ్ నమోదైతే నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. దీనికోసం ప్రత్యేకం 22(ఎ) నిషేధిత జాబితా నుంచి తొలగింపు ఉత్తర్వులు గానీ, ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ కాపీలు గానీ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో తదనుగుణంగా తక్షణం మార్పులు, చేర్పులు చేయాలని సీసీఎల్ఏను ప్రభుత్వం ఆదేశించింది. అంతే కాకుండా వెబ్‌ల్యాండ్ వివరాలను అధికారిక రికార్డుల్లో భద్రపరచాలని సూచించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది భూహక్కుదారులకు కాలయాపన తప్పి రిజిస్ట్రేషన్ ప్రక్రియలు వేగవంతం కానున్నాయి.

అమరావతి సచివాలయ టవర్ల నిర్మాణ పనులకు గ్రీన్‌సిగ్నల్

- రూ.1,477 కోట్లతో ఎంఈపీ పనులకు అనుమతి
- షాపూర్ జీ పల్లోంజీ, ఎల్‌అండ్‌టీ సంస్థలకు కాంట్రాక్టులు


అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాల టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ టవర్లలో ఎంఈపీ (–మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్) మౌలిక సదుపాయాల పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టవర్లు 1, 2 (షాపూర్ జీ పల్లోంజీ): సచివాలయం, హెచ్‌వో డీ కార్యాలయాల టవర్లు 1, 2ల్లో కీలక మౌలిక సదుపాయాల పనులకు టెండర్ ఖరారైంది. రూ.768.89 కోట్ల విలువైన ఈ పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ 'షాపూర్ జీ పల్లోంజీ' దక్కించుకుంది. ఈ సంస్థ ఎలక్ట్రికల్, ఏసీ, ఫైర్ సేఫ్టీ, లిఫ్టులు, ప్లంబింగ్ పనులను చేపట్టనుంది.

టవర్లు 3, 4(ఎల్‌అండ్‌టీ): సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాల టవర్లు 3, 4ల్లో హైసైడ్ ఎంఈపీ పనులకు ప్రభుత్వం అనుమతి తెలిపింది. రూ.708.12 కోట్ల విలువైన ఈ పనులను ప్రముఖ 'ఎల్‌అండ్‌టీ' సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రాజధాని సచివాలయ నిర్మాణ పనుల్లో కీలకమైన అంతర్గత మౌలిక వసతుల పనులకు బహుళజాతి సంస్థలు ఎంపికవ్వడంతో అమరావతి టవర్ల నిర్మాణం త్వరలోనే పూర్తిస్థాయి రూపం దాల్చనుంది.







మురసు తుపాను.. ఎదుర్కొనేందుకు అప్రమత్తం

- 48 గంటలపాటు అధికార యంత్రాంగం హై అలర్ట్
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి..
- ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి: హోంమంత్రి ఆదేశాలు

అమరావతి (చైతన్య రథం): మురసు తీవ్ర తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని, రానున్న 48 గంటల పాటు హై అలర్ట్‌లో ఉండి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. తుపాను ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల కలెక్టర్లకు స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అనిత టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

ఈ సందర్భంగా వాతావరణ శాఖ అంచనాలను అధికారులు వివరించారు. ఇవాళ, రేపు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో మురసు తుపాను తీరం దాటే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వివరించారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు, నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. విద్యుత్ లైన్లపై పడే అవకాశం ఉన్న చెట్ల కొమ్మలు, ప్రమాదకరమైన చెట్లను ముందుగానే తొలగించాలని సూచించారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు కనిపించినా, విద్యుత్ వైర్లు తెగిపడినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తీర ప్రాంతాల్లోని మత్స్యకారులు తమ బోట్లు, వలలను సురక్షితంగా ఉంచుకునేలా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని మంత్రి సూచించారు.

తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ తుపానును ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.

అధికారికంగా జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని సూచించారు. ఈదురుగాలుల సమయంలో విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. మురసు తుపాను గమనాన్ని ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని మంత్రి తెలిపారు. తుపాను కారణంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థకు చెందిన 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని హోంమంత్రి అనిత సూచించారు.

మురసు తుపానుపై మున్సిపల్ యంత్రాంగం అలెర్ట్



- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- హోర్డింగులు, భారీ వృక్షాల వద్ద ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు
- కమిషనర్లతో మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్

అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు.

తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పట్టణ ప్రాంతాల్లో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను ప్రభావంపై రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హోర్డింగులు, భారీ వృక్షాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపడితే వెంటనే తొలగించేలా అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. తుపాను ప్రభావంపై అమరావతి నుంచి నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తగిన ఆదేశాలు జారీ చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి నారాయణ సూచించారు.


తుపానును ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సర్వసన్నద్ధం కావాలి



- 48 గంటల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణే లక్ష్యంగా పనిచేయాలి..
- అవసరమైన సామగ్రి, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలి..
- మూడు డిస్కంల సీఎండీలతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్

అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, ప్రభావిత ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా విద్యుత్ పునరుద్ధరించేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 48 గంటల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. తుపాను సన్నద్ధతపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మూడు డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు పాల్గొన్నారు. తుపాను కారణంగా విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్లు, ఇతర విద్యుత్ సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి సూచించారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైన సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి అదనపు సిబ్బందిని, యంత్రాలను రప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి తెలిపారు. తుపాను తీవ్రత అధికంగా ఉండే జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని సీఎండీలకు సూచించారు. సీఎండీలు స్వయంగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా రెవెన్యూ, సచివాలయ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలను వీలైనంత వరకు తగ్గించేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం 1912 కాల్ సెంటర్‌ను 24 గంటలూ అందుబాటులో ఉంచాలని సీఎండీని ఆదేశించారు. అనంతరం అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

'మురసు'పై అప్రమత్తం



- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి..
- పునరావాస కేంద్రాలు, తాగునీరు, రహదారుల పునరుద్ధరణపై దృష్టి పెట్టాలి..
- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు



అమరావతి (చైతన్య రథం): అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే మురసు రూపంలో మరో తుపాను ముప్పు రాష్ట్రానికి పొంచి ఉన్న నేపథ్యంలో, విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, ఆయా జిల్లాల యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

అవసరమైనచోట పునరావాస కేంద్రాల ఏర్పాట్లు, తాగునీరు, భారీ వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రోడ్లను తక్షణం పునరుద్ధరించడం, రోడ్లపై చెట్లు కూలితే వెంటనే తొలగించడం వంటి చర్యల్లో భాగస్వామ్యం కావాలని తెలిపారు. మురసు తుపాను ఈ రోజు తీరం తాకనుందన్న హెచ్చరికల నేపథ్యంలో తన పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావం ఉండనున్న జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు.

మురసు తుపాను మొదట బాపట్ల, మచిలీపట్నం మధ్య తీరం తాకుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం తుపాను దిశ మార్చుకుని నెల్లూరుకు సమీపంగా తీరం దాటబోతోందని, తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, మార్కాపురం జిల్లాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు వివరించారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు ఈ మధ్యాహ్నం తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు. తీరాన్ని తాకే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అత్యంత భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే ఆరు ఎన్‌డీఆర్ఎఫ్, ఏడు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్టు వివరించారు.

అర్నబ్ తుపాను మాదిరి మురసు తుపానును కూడా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖలతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చే హెచ్చరికల ఆధారంగా గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. గ్రామాలకు సమీపంలో ఉండే వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, ఉద్ధృతంగా ప్రవహించే వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే బ్లీచింగ్, క్లోరినేషన్ చేసేందుకు వీలుగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి నిర్దేశం చేశారు.

ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు పెద్ద ఎత్తున నేలకొరిగే అవకాశాలు ఉన్న క్రమంలో, నష్టం జరిగిన తర్వాత వీలైనంత త్వరగా పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బందికి సూచనలు చేశారు. వర్షాలకు రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కొట్టుకుపోయినా వెంటనే స్పందించాలని, ప్రమాదకరమైన రహదారులు, లో లెవల్ కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంలో తుపాను తాలూకు అలజడి పూర్తిగా తగ్గి, అధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని, తీర ప్రాంత ప్రజలు బీచ్‌ల వద్దకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. తుపాను సమయంలో అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. పంటల నష్టం తగ్గించేలా రైతులకు ముందస్తు సూచనలు చేయాలని, భారీ వర్షాల కారణంగా పంటలు నీట మునిగిన చోట వర్షపు నీటిని వెంటనే మళ్లించే ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వం నుంచి వచ్చే హెచ్చరికలు పాటిస్తూ, యంత్రాంగానికి సహకరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని పవన్ కళ్యాణ్ కోరారు.

సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులు క్షేమం

- మత్స్యశాఖ, మెరైన్ పోలీసుల సమన్వయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరిన బోటు
- రక్షణ చర్యల్లో పాల్గొన్న అధికారులను అభినందించిన కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు (చైతన్య రథం): సముద్రంలో బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను అధికారులు, స్థానిక మత్స్యకారుల సమన్వయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సమయస్ఫూర్తితో చేపట్టిన రక్షణ చర్యలతో బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో పాటు అందులోని ఏడుగురిని క్షేమంగా రక్షించినట్లు వెల్లడించారు. కావలి నియోజకవర్గంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు నెల్లూరు సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో వాతావరణంలో మార్పులను గమనించారు. దీంతో తిరిగి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలో బోటు ఇంజన్ చెడిపోవడంతో హార్బర్ మౌత్ పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ విషయాన్ని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వైలెన్స్ సిబ్బంది గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో రక్షణ చర్యలు ప్రారంభించారు. సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో తొలుత బోటు వద్దకు చేరుకోవడం కష్టతరమైంది.

ఈ క్రమంలో బోటుకు వేసిన లంగరు తెగిపోవడంతో అలల ఉధృతికి బోటు పాతకడపాలెం గ్రామం వైపు కొట్టుకుపోయింది. వెంటనే అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో బోటును అనుసరిస్తూ రక్షణ చర్యలు కొనసాగించారు. చివరకు బోటును పాతకడపాలెం సముద్ర తీరానికి సురక్షితంగా చేర్చి, అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. ఈ రక్షణ చర్యల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వైలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

తుపాను సమస్యలకు మనమిత్రతో తక్షణ పరిష్కారం

- సమస్యలపై వాట్సాప్ ద్వారా అధికారులకు సమాచారం

- 9552300009కు హాయ్ మెసేజ్ చేయండి: ఆర్టీజీఎస్ సూచన

అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తుపాను సమయంలో విద్యుత్ అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, గోడలు కూలడం, ఇళ్లలోకి నీరు చేరడం వంటి సమస్యలతో పాటు ఇతర ఇబ్బందులను కూడా మనమిత్ర వాట్సాప్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిర్యాదు నమోదు చేసుకునే విధానం ఇలా..

- ముందుగా 9552300009 వాట్సాప్ నంబర్‌కు 'Hi' అని మెసేజ్ పంపాలి.

- అనంతరం కనిపించే సేవల ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

- అందులో 'మురసు సైక్లోన్ ఇష్యూస్' అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

- తర్వాత 'రిపోర్ట్ ఇష్యూ' ఆప్షన్‌ను ఎంపిక చేసి, కన్ఫర్మ్ చేయాలి.

- అనంతరం రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

- మీ పేరు, జిల్లా, మండలం వివరాలను నమోదు చేయాలి.

- మీ ప్రాంతంలో తుపాను కారణంగా ఎదురవుతున్న సమస్యను వివరంగా తెలియజేయాలి.

సమస్యకు సంబంధించిన ఫొటోలను కూడా వాట్సాప్‌లో అప్‌లోడ్ చేసే అవకాశం ఉంది. ఇలా నమోదు చేసిన ఫిర్యాదును వెంటనే సంబంధిత ప్రాంత అధికారులకు పంపించి, సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటారు. తుపాను సమయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను త్వరగా పరిష్కరించేందుకు ఈ సదుపాయం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

అత్యవసర సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు

తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఏపీఎస్‌డీఎంఏకు చెందిన 112, 1070, 18004250101 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మనమిత్ర వాట్సాప్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు.



వణికిస్తున్న మురసు!

- అర్ధరాత్రి నెల్లూరు-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 100-110 కి.మీ. వేగంతో గాలులు..
- 120 కి.మీ. వరకు ఈదురుగాలులు
- బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో రెడ్ అలెర్ట్ హెచ్చరికలు



అమరావతి (చైతన్య రథం): మురసు తీవ్ర తుపాను దక్షిణ కోస్తాంధ్ర తీరానికి చేరువైంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజా బులెటిన్ ప్రకారం సోమవారం రాత్రి 11.30 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల మధ్య నెల్లూరు-నర్సాపురం మధ్య, ఒంగోలుకు దక్షిణంగా దక్షిణ కోస్తాంధ్ర తీరాన్ని తీవ్ర తుపానుగా దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100-110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని ఐఎండీ హెచ్చరించింది.

సోమవారం సాయంత్రం 6.55 గంటలకు విడుదల చేసిన ఐఎండీ తీరప్రాంత బులెటిన్ ప్రకారం తుపాను గత ఆరు గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో వాయవ్య దిశగా కదిలింది. ప్రస్తుతం కావలికి 70 కిమీ, నెల్లూరుకు 80 కిమీ, ఒంగోలుకు 90 కిమీ, బాపట్లకు 120కిమీ, తిరుపతికి 170కిమీ, మచిలీపట్నంకు 170కిమీ దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది.

తీర ప్రాంతాలకు తుపాను ఉప్పెన ముప్పు

తుపాను తీరం దాటే సమయంలో దక్షిణ కోస్తాంధ్రలోని లోతట్టు ప్రాంతాలు సముద్రపు నీటితో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు సాధారణ అలల మట్టంకంటే 0.5 మీటర్లకుపైగా తుపాను ఉప్పెన సంభవించే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము మధ్య ఉప్పెన గరిష్ఠంగా 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తుకు చేరవచ్చని అంచనా వేసింది. బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో దీని ప్రభావం అధికంగా ఉండవచ్చని పేర్కొంది.

దక్షిణ కోస్తాంధ్ర తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు. నిజాంపట్నం, వాడరేవు ఓడరేవుల్లో గ్రేట్ డేంజర్ సిగ్నల్ నంబర్ 10, మచిలీపట్నంలో నంబర్ 9, కృష్ణపట్నంలో నంబర్ 8 ఎగురవేశారు. ఉత్తరాంధ్రలోని కళింగపట్నం, విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ ఓడరేవుల్లో స్థానిక హెచ్చరిక సిగ్నల్ నంబర్ 3 కొనసాగుతోంది.

పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

మురసు తుపాను ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ), ఆర్టీజీఎస్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. రాయలసీమలోనూ వర్ష ప్రభావం ఉండనుందని అధికారులు తెలిపారు.

ప్రజలకు అధికారుల సూచనలు

తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు హెచ్చరికలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడిన చోట్లకు వెళ్లవద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. మత్స్యకారులు పడవలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని, సముద్రంలోకి వెళ్లవద్దని స్పష్టం చేశారు. తుపాను తీరందాటే సమయంలో గాలుల తీవ్రత, భారీ వర్షాలు, తుపాను ఉప్పెన కారణంగా తీరప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ అధికారులు సూచించారు.

మురసు తుపానుపై ఇరిగేషన్ అప్రమత్తం: మంత్రి నిమ్మల



అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను నేపథ్యంలో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. తుపాను పరిస్థితులు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సోమవారం ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

మురసు తుపాను ఈరోజు సాయంత్రం నెల్లూరు-ఒంగోలు మధ్య తీరం దాటే అవకాశం ఉందని, కృష్ణా, పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఇరిగేషన్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి రిజర్వాయర్లలో నీటి ప్రవాహాలను పర్యవేక్షిస్తూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

నాగార్జునసాగర్ క్యాచ్‌మెంట్ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడి పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. గుండ్లకమ్మ, రాళ్లపాడు రిజర్వాయర్లకు వరద వచ్చే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

తుపాను నేపథ్యంలో పటిష్టమైన వరద నియంత్రణ నిర్వహణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఫ్లడ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు పంట నష్టం జరగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఇంజనీర్-ఇన్-చీఫ్ నరసింహమూర్తి, పలువురు చీఫ్ ఇంజనీర్లు (సీఈలు), సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) పాల్గొన్నారు.



మురసు తుపానువేళ వైద్య సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు



- 13 జిల్లాల్లో 724 వైద్య బృందాలు
- 4,628 అత్యవసర పడకలు సిద్ధం
- 3,066 మంది గర్భిణుల్లో 1,103 మందిని ఆస్పత్రులకు తరలింపు
- ఆర్టీజీఎస్‌తో అనుసంధానమైన అంబులెన్స్ సేవలు

అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను ప్రభావిత జిల్లాల్లో ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉన్న 13 జిల్లాల్లో 724 వైద్య బృందాలు, 4,628 అత్యవసర పడకలు, 205 సహాయ శిబిరాలను సిద్ధం చేసింది.

తుపాను సన్నద్ధతలో భాగంగా అంబులెన్స్ సేవలను ఆర్టీజీఎస్ పోర్టల్‌తో అనుసంధానించి, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 866 ప్రభుత్వ వైద్యశాలల్లో 398 వైద్యశాలలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 359 అంబులెన్సులు (108), 128 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు (102), 320 సంచార వైద్య వాహనాలు (104) అందుబాటులో ఉంచారు. వీటితో పాటు సుమారు 300 ప్రైవేటు అంబులెన్సులను కూడా ఆర్టీజీఎస్ పోర్టల్‌తో అనుసంధానించారు.

ఆర్టీజీఎస్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు అంబులెన్సుల వివరాలను ఒకే డిజిటల్ వేదికపై పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. తుపాను సమయంలో అత్యవసర వైద్య సేవలను వేగంగా అందించడంతో పాటు, అవసరమైన ప్రాంతాలకు అంబులెన్సులను సమర్థంగా కేటాయించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుంది. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో అంటువ్యాధుల నిఘా కేంద్రాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

గర్భిణుల తరలింపుపై ప్రత్యేక దృష్టి

నవంబర్ 1నుంచి 10వ తేదీ మధ్య ప్రసవ గడువు ఉన్న 3,066 మంది గర్భిణులను అధికారులు గుర్తించారు. వీరిలో 1,103 మందిని ఇప్పటికే సమీప ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన వారిని అవసరాన్ని బట్టి ముందుగానే ఆస్పత్రులకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భిణుల నివాస ప్రాంతాలను బట్టి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవ సదుపాయాలు కల్పిస్తున్నారు.

వైద్య సదుపాయాలు సిద్ధం

తీర ప్రాంతాల్లోని 121 ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. పాముకాటు నివారణకు 15,161 ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచారు. 848 వైద్యశాలల్లో జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలను సిద్ధం చేశారు. వర్షాలు, వరదల నేపథ్యంలో నీరు, దోమలు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. తాగునీటి శుద్ధి కోసం క్లోరిన్ మాత్రలను అందుబాటులో ఉంచారు. సురక్షిత తాగునీటి సరఫరా కోసం పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుంటున్నారు. ప్రజలకు వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. తుపాను సన్నద్ధతలో భాగంగా చేపట్టిన వైద్య ఏర్పాట్ల వివరాలను అధికారులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు.

మురసు తుపాను నేపథ్యంలో

ఆర్ అండ్ బీ అధికారులు అప్రమత్తం

రహదారులు, వంతెనల వద్ద నిరంతర పర్యవేక్షణ - వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లో రాకపోకల నియంత్రణ - అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాలు

అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, వంతెనల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) అధికారులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీర ప్రాంత జిల్లాలైన కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. వీటితో పాటు ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, మార్కాపురం, అల్లూరి, పోలవరం, నంద్యాల, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికారులు కూడా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతినే అవకాశం ఉన్న రహదారులు, వంతెనలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనల వద్ద వరద ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రహదారులపై వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను నియంత్రించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రహదారులపై చెట్లు కూలినట్లయితే వెంటనే తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు.



ఎన్నికల రద్దు డిమాండ్

- **బీసీ హక్కులకు విఘాతం కలిగించడమే**
- **వైసీపీపై మంత్రి అనగాని ఆగ్రహం**



అమరావతి (చైతన్య రథం): బీసీలకు చట్ట ప్రకారం దక్కాల్సిన 34 శాతం రిజర్వేషన్లకు మించి 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించి, వారికి రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బీసీలకు అధిక రిజర్వేషన్లు కల్పించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే, వాటిని రద్దు చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడం బీసీ హక్కులకు విఘాతం కలిగించడమేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీసీలకు 34 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు మాటలకే పరిమితం చేయకుండా అమలు చేసి చూపించారని మంత్రి పేర్కొన్నారు. చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనా అధిగమించి 52 శాతం రిజర్వేషన్లతో కార్పొరేషన్, మున్సిపల్, నగర పంచాయతీ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా అధికారం దక్కడం ఇష్టంలేకే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తూ, ఎన్నికల సమయంలో ఆందోళనలు చేస్తూ, తప్పుడు ఫిర్యాదులు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా 52 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. బీసీలు మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఎదగడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం బలమైన పునాది వేస్తుంటే, దాన్ని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించిన ప్రాతినిధ్యానికి సంబంధించిన వివరాలను మంత్రి వెల్లడించారు. కార్పొరేషన్ మేయర్ పదవుల్లో మొత్తం 13 స్థానాలకు గాను ఏడింటిని, మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో 77 స్థానాలకు గాను 33 స్థానాలను, నగర పంచాయతీల్లో 10 స్థానాలకు గాను ఆరు స్థానాలను బీసీలకు కేటాయించినట్లు వివరించారు. బీసీలకు కేవలం హామీలు ఇవ్వడం కాకుండా, అధికారంలో వాటా కల్పించి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించడమే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని మంత్రి పేర్కొన్నారు. బీసీల గౌరవం, గుర్తింపు, రాజ్యాధికారం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బీసీల సాధికారత దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆపలేరని స్పష్టం చేశారు. 'జయహో చంద్రన్న.. జయహో బీసీ' అంటూ ఒక ప్రకటనలో మంత్రి అనగాని పేర్కొన్నారు.

మురసు తుపాను నేపథ్యంలో

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి

పాకల బీచ్‌లో అలల ఉధృతిని పరిశీలించిన మంత్రి స్వామి

ప్రకాశం (చైతన్య రథం): మురసు తుపాను నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గేవరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను పరిస్థితులపై సోమవారం జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పునరావాస కేంద్రాల్లో వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వాగులు, వంకల సమీపంలో ప్రజలు సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు తమ పడవలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విజ్ఞప్తి చేశారు. అనంతరం సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌ను సందర్శించిన మంత్రి సముద్రంలో అలల ఉధృతిని పరిశీలించారు. అధికారులు, మత్స్యకారులతో మాట్లాడి సముద్ర తీర ప్రాంతంలోని పడవలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకున్నారు.




మత్స్యకార కుటుంబానికి అండగా ఉంటాం

- మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు చర్యలు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి (చైతన్య రథం): కర్ణాటక రాష్ట్రంలోని మంగుకూరు ప్రాంతంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం జీరుపాలెం గ్రామవాసి సూరాడ రామస్వామి (32) కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై స్పందించిన మంత్రి సంబంధిత మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని స్వగ్రామమైన జీరుపాలెంకు తీసుకువచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చేపల వేట కోసం అక్టోబర్ 25న కర్ణాటకకు వెళ్లిన రామస్వామి నవంబర్ 2న మృతి చెందడంపట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. విషాద సమయంలో బాధిత కుటుంబం ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కుటుంబీకులకు భరోసా కల్పించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చే ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.





ప్రశాంత పోలింగ్‌తో జగన్ కుట్రలు విఫలం

- **పులివెందుల, కడపలో అధిక పోలింగ్ వైఎస్సార్ కుటుంబ నిరంకుశ ధోరణిపై ప్రజల తిరుగుబాటుకు నిదర్శనం..**
- **ఓటు వేయకుండా జగన్ సెల్ఫ్ గోల్**
- **ఎన్నికల యంత్రాంగం, పోలీసులు అధికారుల పనితీరు భేష్**
- **ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా 13 మునిసిపల్ కార్పొరేషన్లు, 79 మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు ప్రశాంతంగా పోలింగ్ జరగడంపై రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వెలిబుచ్చారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసు, సంబంధిత అధికారులను మంత్రి సోమవారం ఒక ప్రకటనలో అభినందించారు.

నీరుగారిన జగన్‌రెడ్డి కలలు.. తిరగబడిన జిల్లా ప్రజలు

పురపాలక ఎన్నికల్లో పోలింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలను రెచ్చగొట్టి, అనివార్యమైన తన ఓటమికి సాకులు చూపే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుట్ర పూర్తిగా విఫలమైందని మంత్రి అన్నారు. ఆదివారంనాటి పోలింగ్‌లో పులివెందులలో 71 శాతం, కడప కార్పొరేషన్‌లో 70 శాతం పోలింగ్‌తో పాటు, కడప జిల్లా వ్యాప్తంగా 70 శాతానికి పైగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రస్తుత ఎన్నికలు జగన్ ఆశయాలకు భిన్నంగా స్వేచ్ఛా వాతావరణంలో జరిగాయనడానికి నిదర్శనమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ మూడు చోట్ల జరిగిన పోలింగ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పోలింగ్‌లో అగ్రభాగాన ఉండడం ప్రత్యేకంగా గమనార్హమని, ఈ స్థాయిలో జరిగిన పోలింగ్ జిల్లాలో దశాబ్దాలుగా వైఎస్సార్ కుటుంబ నిరంకుశ ధోరణిపై జిల్లా ప్రజల తిరుగుబాటుకు చిహ్నమని, ఇకనైనా జగన్‌రెడ్డి తన ధోరణిని మార్చుకోవాలని మంత్రి హితవు పలికారు.

ఓటు వేయకుండా సెల్ఫ్ గోల్ చేసుకున్న జగన్‌రెడ్డి

ప్రజాస్వామ్యంలో అతి పవిత్రమైన, రాజ్యాంగ ప్రసాదితమైన ఓటు హక్కును స్వస్థలం పులివెందులలో వినియోగించుకోకుండా మాజీ సీఎం సెల్ఫ్ గోల్ చేసుకున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఆయన ప్రవర్తన.. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయన్న నానుడికి అనుగుణంగా ఉందని మంత్రి అన్నారు. ఓటు వేయకపోవడానికి సంబంధించిన పలు ప్రశ్నలకు జగన్ సమాధానమివ్వాలని మంత్రి డిమాండ్ చేశారు. పులివెందులలో ఎన్నికలు జరిగిన తీరుకు నిరసనగా తాను ఓటు వేయలేదని చెప్పుకున్న జగన్‌రెడ్డి.. మిగిలిన 91 పురపాలక సంస్థలకు ఎన్నికలు సవ్యంగా జరిగాయని అంగీకరించినట్లయ్యిందని మంత్రి వ్యాఖ్యానించారు.

మీడియా ముందు చొక్కా మడిచి, పోలింగ్ నాడు పులివెందులలోనే ఉంటాను.. ఎవరొస్తారో రండి అంటూ ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన



జగన్, ప్రశాంత వాతావరణంలో జరిగిన ఓటింగ్ సరళితో మైండ్ బ్లాక్ అయి నానా డ్రామాలకు దిగజారారని మంత్రి సత్యకుమార్ యాదవ్ దుయ్యబట్టారు. తాను హింసకు పిలుపునిచ్చినా పులివెందుల ప్రజలు దాన్ని తిరస్కరించినందుకు నిరసనగా ఓటు వేయకపోవడం సబబా అని జగన్‌రెడ్డిని మంత్రి నిలదీశారు. తాను చెప్పిన సమయానికి కాకుండా ముందుగానే హెలికాప్టర్‌లో వచ్చి తాను దిగడానికి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని, నియమాల ప్రకారం జారీ అయిన పోలింగ్ ఏజెంట్ల రిలీవింగ్ ఆర్డర్లను చూపిస్తూ 70 చోట్ల తమ ఎన్నికల ఏజెంట్లు లేకుండా చేశారని అసత్యపు ఆరోపణలకు దిగజారి మీడియా ముందు నానా యాగీ చేసి తన ఓటమికి కారణాలు చూపే విఫల ప్రయత్నం చేశారని, ఇది హాస్యాస్పదమని, దీన్ని ప్రజలు గమనించారని మంత్రి వ్యాఖ్యానించారు. పలు చోట్ల రౌడీ షీటర్లను వైసీపీ ఎన్నికల ఏజెంట్లుగా నియమించడంతో వారంతా తిరస్కరణకు గురైనట్టు వచ్చిన వార్తలు తనకు దిగ్భ్రాంతిని కలిగించాయని మంత్రి అన్నారు.

జగన్‌రెడ్డి అసంబద్ధ నిరసన

తాను ఓటు వేస్తే అంతా సవ్యంగా జరిగిందని ప్రజలు అనుకుంటారు కనుక తాను ఓటు వేయలేదని జగన్‌రెడ్డి ఇచ్చిన వివరణ పూర్తిగా అసంబద్ధంగానూ, అపహాస్యంగానూ ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. అట్టి నిరసన కేవలం తనకు ఓటు ఉన్న బాకరాపురం బూత్‌కే పరిమితమా లేక పులివెందులతో పాటు రాష్ట్రానికి అన్వయిస్తుందా అనే ప్రశ్నకు జగన్‌రెడ్డి సమాధానం ఇవ్వాలని మంత్రి డిమాండ్ చేశారు. తాను చేసిన పని రాష్ట్ర స్థాయి నిరసన అయితే.. ఆదివారంనాడు 60 శాతానికి పైగా జరిగిన పోలింగ్‌లో వైసీపీ మద్దతుదారులు ఎవరూ ఓటు వేయలేదా అని జగన్‌ను మంత్రి ప్రశ్నించారు. ప్రశాంత ఎన్నికలపై విశ్వాసం లేకుంటే వైసీపీ అభ్యర్థులను, మద్దతుదారులను ఎన్నికలను బహిష్కరించాలని జగన్‌రెడ్డి ఎందుకు పిలుపు ఇవ్వలేదని మంత్రి ప్రశ్నించారు.

నవ్వులపాలైన జగన్‌రెడ్డి

స్థానిక ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి తన అసంబద్ధ, అనుచిత వ్యాఖ్యలు, చేతలతో జగన్‌రెడ్డి ప్రజల్లో నవ్వులపాలయ్యారని, వైసీపీ నాయకులు, మద్దతుదారులు కూడా జగన్ ధోరణితో తలలు పట్టుకుంటున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఇకనైనా రాజకీయ పరిణతి, ప్రజాస్వామ్య పద్ధతిలో జగన్ వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు.

అధికార యంత్రాంగానికి మంత్రి అభినందనలు

ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పురపాలక పోరులో జరిగిన ఓటింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం, డీజీపీ, పోలీసు యంత్రాంగం, పలు బాధ్యతలు నిర్వహించిన ఇతర అధికారులు, సిబ్బందిని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలను నిర్వహించి కూటమి ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని మంత్రి కోరారు.



కర్నూలు జిల్లాలో కరవు పరిస్థితులపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

కర్నూలు (చైతన్య రథం): ఖరీఫ్-2026 సీజన్‌లో కర్నూలు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. మద్దికెర, పత్తికొండ, తుగ్గలి మండలాల్లోని రైతుల పొలాలను సందర్శించి, పంటల పరిస్థితిని పరిశీలించారు. వర్షాభావం కారణంగా ఎదురైన ఇబ్బందులు, పంట నష్టాల వివరాలను రైతులు, స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందంలో భారత ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె. పొన్నుసామి, రాష్ట్ర నోడల్ అధికారి, డబ్ల్యూడీఎం డైరెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బటానా, ఆర్ఐసీ, ఎన్‌పీఎంయు-పిహెచ్‌ఈకి చెందిన ధీరేంద్ర కుమార్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అండర్ సెక్రటరీ ప్రదీప్ కుమార్, కేంద్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ లైవ్‌స్టాక్ ఆఫీసర్ డాక్టర్ సాక్షి భదౌరియా తదితరులు ఉన్నారు. జిల్లా అధికారులు కూడా కేంద్ర బృందం పర్యటనలో పాల్గొన్నారు.



విశాఖలో పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

- **ఈనెల 12, 13 తేదీల్లో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు**
- **పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**



అమరావతి (చైతన్య రథం): ఈనెల 12, 13 తేదీల్లో రెండు రోజులపాటు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) జరగనుంది. ఈ సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ సోమవారం ఏపీ సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. దేశ, విదేశాలకు చెందిన పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఏర్పాట్లు ఉండాలని సీఎస్ సూచించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, కంపెనీల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న పరిస్థితులు, అవకాశాలను సదస్సుకు హాజరయ్యే పెట్టుబడిదారులకు సమగ్రంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చేలా సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేయాలని స్పష్టం చేశారు. సదస్సు విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సదస్సు ఏర్పాట్లు, ఇతర అంశాలను వివరించారు. భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరుకానున్నారని వివరించారు. దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులు, వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ముఖ్య కార్యదర్శులు ఎస్. సురేశ్ కుమార్, ముఖేష్ కుమార్ మీనా, కాంతిలాల్ దండే, ఐఅండ్‌సీ కార్యదర్శి ఎన్. యువరాజ్, విద్యాశాఖ కార్యదర్శి కె. శశిధర్, ఏపీఐఐసీ ఎండీ దినేష్ కుమార్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ గీతాంజలి శర్మ, ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వ, ఏపీ ఈడీబీ సీఈఓ షన్మోహన్, ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ షబ్నమ్ బన్సల్, ఏపీఐఐసీ ఈడీ యశ్వంత్ కుమార్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజాహృదిలో ఎర్రన్న చిరస్థాయి: అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్య రథం): దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 14వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘనంగా నివాళులర్పించారు. ఉత్తరాంధ్ర గుండెచప్పుడుగా, తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా నిలిచి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు ఎర్రన్నాయుడు అని కొనియాడారు. నందమూరి తారక రామారావు ఆశయాలకు ఆకర్షితులై రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎర్రన్నాయుడు.. తెలుగుదేశం పార్టీ స్థాపన నుంచి పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేశారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు నమ్మకమైన నాయకుడిగా, చంద్రబాబు నాయుడుకు అత్యంత ఆప్తుడిగా, క్లిష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచారని గుర్తుచేశారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ తెలుగుదేశం పార్టీ గళాన్ని బలంగా వినిపించి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా,



కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఎర్రన్నాయుడు ప్రజలకు విశేష సేవలందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, రైల్వే అభివృద్ధి, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు. పదవుల కంటే ప్రజలకే ప్రాధాన్యమిచ్చి, కార్యకర్తలకు కష్ట సమయంలో అండగా నిలిచిన ప్రజానాయకుడని కొనియాడారు. ఎర్రన్నాయుడు తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, రాజకీయ గురువు, మార్గదర్శి అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవడం, కార్యకర్తలకు అండగా నిలవడం, రాజకీయాల్లో విలువలను కాపాడుకోవడం వంటి విషయాలను ఆయన నుంచే నేర్చుకున్నానని తెలిపారు. తన రాజకీయ జీవితంలోని ప్రతి అడుగులోనూ ఎర్రన్నాయుడు ప్రోత్సాహం, మార్గనిర్దేశం ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ ఆశయాలను కొనసాగించడమే తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. భౌతికంగా ఎర్రన్నాయుడు దూరమై 14 ఏళ్లు గడిచినా, ఆయన పంచిన ఆత్మీయత, అందించిన సేవలు, నేర్పిన విలువలు, మిగిల్చిన జ్ఞాపకాలు తమ హృదయాల్లో ఎప్పటికీ సజీవంగా ఉంటాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆయన లేని లోటును ఎవరూ తీర్చలేరని, అయితే ఆయన చూపిన మార్గం, అందించిన స్ఫూర్తి ప్రతి అడుగులోనూ తమకు తోడుగా ఉంటాయని నివాళి సందేశంలో పేర్కొన్నారు. ఎర్రన్నాయుడు ఆశయాలే తమ మార్గమని, ఆయన ప్రజాసేవే ఆదర్శమని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి

మంత్రి డోలా స్వామి పిలుపు
పాకలలో ఇంటింటి ప్రచారం..

ప్రకాశం/ సింగరాయకొండ (చైతన్య రథం): గ్రామాల అభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సింగరాయకొండ మండలం పాకలలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి అభ్యర్థులకు మద్దతు కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మంత్రి ప్రజలకు వివరించారు. కూటమి అభ్యర్థుల విజయంతోనే గ్రామాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. వైసీపీని ఉద్దేశించి 'గొడ్డలి పార్టీకి ఓటు వేస్తే వృథానే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు' అని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.



పంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్‌కు

ఓట్లు అడిగే హక్కు లేదు

- **రూ.9 వేల కోట్ల పంచాయతీ నిధులు దారి మళ్లించారు..**
- **గ్రామీణ ఎన్నికల్లో వైసీపీని ఓడించాలి**
- **ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ విజయకుమార్ పిలుపు**

మంగళగిరి (చైతన్య రథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, గ్రామీణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ విమర్శించారు. పంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులను దారి మళ్లించి, స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ఆరోపించారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో వైసీపీకి గ్రామీణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో కేంద్రం నుంచి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం పంచాయతీలకు అందకుండా చేశారని ఆరోపించారు. పంచాయతీల డిజిటల్ కీలను ఉపయోగించి అర్ధరాత్రి వేళ ఖాతాల నుంచి దాదాపు రూ.3 వేల కోట్లను ప్రభుత్వం లాగేసుకుందని, ఐదేళ్లలో మొత్తం రూ.8,600 కోట్ల నుంచి రూ.9 వేల కోట్ల వరకు పంచాయతీ నిధులను



దారి మళ్లించిందని విమర్శించారు. ఈ ఆరోపణలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, జగన్ కూడా ముందుకు రావాలని సవాల్ విసిరారు.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు కల్పించిన అధికారాలు, హక్కులను గత ప్రభుత్వం కాలరాసిందని విజయకుమార్ అన్నారు. పంచాయతీలకు సమాంతరంగా వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ప్రాధాన్యాన్ని తగ్గించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు సక్రమంగా చెల్లించకుండా బకాయిలు పెట్టారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే వాటిని చెల్లించిందని తెలిపారు. పంచాయతీల వద్ద విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కూడా నిధులు లేకుండా పోయాయని, పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ, గ్రామీణ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని విమర్శించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంతో కేంద్రం జల్ జీవన్ మిషన్ కింద దాదాపు రూ.10 వేల కోట్లు కేటాయించినా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో ఆ నిధులను వినియోగించుకోలేకపోయిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో 70 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామని జగన్ ప్రకటించారని, అయితే కూటమి ప్రభుత్వం పరిశీలనలో 20 లక్షల కనెక్షన్లు కూడా పూర్తిస్థాయిలో లేవని తేలిందని పేర్కొన్నారు. నీటి సరఫరా సదుపాయాలు లేకుండానే అనేక చోట్ల కుళాయిలు ఏర్పాటు చేశారని విమర్శించారు.

రోడ్ల నిర్మాణంలో కూటమి ప్రభుత్వ పనితీరు మెరుగ్గా ఉంది

గ్రామీణ రోడ్ల నిర్మాణం, మరమ్మతుల విషయంలోనూ గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని విజయకుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా రెండున్నరేళ్లలో 9,600 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించిందని, రాబోయే మూడేళ్లలో మరో 6 వేల కిలోమీటర్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం 1,800 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మించిందని ఆరోపించారు.

'పల్లె పండుగ' ఫేజ్-1, ఫేజ్-2లో కలిపి దాదాపు 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించగా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 737 కిలోమీటర్ల మేర మాత్రమే నిర్మించారని తెలిపారు. రోడ్ల మరమ్మతుల విషయంలో కూటమి ప్రభుత్వం 21 వేల కిలోమీటర్లకు పైగా పనులు చేపట్టిందని, గత ప్రభుత్వం 7,600 కిలోమీటర్లకే పరిమితమైందని పేర్కొన్నారు. రాష్ట్ర రహదారుల నిర్మాణంలోనూ కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలో 2,700 కిలోమీటర్లు పూర్తి చేయగా, వైసీపీ ఐదేళ్లలో 1,200 కిలోమీటర్లు మాత్రమే నిర్మించిందని వివరించారు. ఈ గణాంకాలకు సంబంధించి గ్రామాలు, మండలాల వారీగా వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

2014-19 మధ్య చంద్రబాబు నాయుడు హయాంలో కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన రూ.36 వేల కోట్లను స్థానిక సంస్థల అభివృద్ధికి కేటాయించారని విజయకుమార్ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పంచాయతీలకు వచ్చిన నిధులను ఎందుకు దారి మళ్లించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను నిర్లక్ష్యం చేసిన వైసీపీకి మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి ప్రజలు మద్దతు తెలిపినట్లుగానే, రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామీణ ఓటర్లు కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజయకుమార్ కోరారు. గ్రామాల అభివృద్ధి, పంచాయతీల ఆత్మగౌరవం కాపాడాలంటే స్థానిక సంస్థలకు నిధులు సక్రమంగా అందాలని, అందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

ఖరీఫ్ కరవు నష్టాలపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన



- **అనంతపురం జిల్లాలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ బృందం**
- **రాష్ట్రవ్యాప్తంగా రూ.1,420 కోట్ల కేంద్ర సాయం కోరిన ప్రభుత్వం**
- **జిల్లాకు రూ.380 కోట్ల సాయం కావాలని కలెక్టర్ నివేదిక**

అనంతపురం (చైతన్య రథం): సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్–2026 సీజన్‌లో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ కేంద్ర కరువు బృందం సోమవారం అనంతపురం జిల్లాలో పర్యటించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని బృందం ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవనంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, ఎండిపోయిన పంటలకు సంబంధించిన చిత్రాలను తిలకించింది.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కరువు సహాయం కింద కేంద్ర ప్రభుత్వానికి రూ.1,420 కోట్ల సాయం కోరుతూ సమర్పించిన ప్రతిపాదనల వివరాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, రాష్ట్ర నోడల్ అధికారి మనజీర్ జీలానీ సమూన్ కేంద్ర బృందానికి వివరించారు. అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితులు, పంట నష్టాల ఆధారంగా ఆరు విభాగాల కింద రూ.380 కోట్ల కేంద్ర సాయం కావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ నివేదించారు.

క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత సమగ్ర నివేదిక

ఈ సందర్భంగా కేంద్ర బృందం నాయకుడు చిన్మయ్ గోట్మారే మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న కరువు పరిస్థితులపై రాష్ట్ర అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ముసాయిదా వినతిపత్రం (డ్రాఫ్ట్ మెమోరాండం) తమకు ఇప్పటికే అందిందని పేర్కొన్నారు. కేంద్ర సహాయం కింద రాష్ట్రానికి అవసరమైన నిధుల వివరాలను వ్యవసాయ శాఖ సంచాలకులు స్పష్టంగా వివరించారని చెప్పారు. తాము స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ



పరిస్థితులను పరిశీలిస్తున్నామని, పర్యటన ముగిసిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో తదుపరి చర్చలు జరుగుతాయని తెలిపారు. కరువు తీవ్రతను సమగ్రంగా వివరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో 388 మండలాలు కరువు ప్రభావితం

అంతకుముందు రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు మనజీర్ జీలానీ సమూన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నుంచే కరువు నివారణ చర్యలు చేపట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతి 15 రోజులకు ఒకసారి కరువుపై సమీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. భారత ప్రభుత్వానికి దాదాపు రూ.1,420 కోట్ల కేంద్ర సాయం కోరుతూ సమగ్ర వినతిపత్రం సమర్పించామని, ఇందులో అత్యధిక భాగం వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రతిపాదనలేనని వివరించారు.

సెప్టెంబర్ 1 నాటికి రాష్ట్ర సగటు వర్షపాతం లోటు మైనస్ 52 శాతంగా నమోదైందని, ఇది దేశ సగటు లోటు కంటే దాదాపు నాలుగు రెట్లు అధికమని తెలిపారు. ప్రకాశం జిల్లాలో మైనస్ 70 శాతం, అన్నమయ్య జిల్లాలో మైనస్ 76 శాతం వర్షపాతం లోటు నమోదైందని వివరించారు. గ్రామస్థాయిలో వివిధ శాఖల అధికారులు, నీటి వినియోగదారుల సంఘాలు, రైతు సంఘాలతో ఎల్‌నినో నివారణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (గ్రీన్‌మా) విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీని 21 వేల క్వింటాళ్ల నుంచి దాదాపు 2 లక్షల క్వింటాళ్లకు పెంచామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. తాగునీటి సరఫరాలో మనుషులకు మొదటి ప్రాధాన్యం, పశువులకు రెండో ప్రాధాన్యం, వ్యవసాయ, ఉద్యాన పంటల రక్షణకు మూడో ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు.

శాటిలైట్ చిత్రాలు, ఎన్‌డీవీఐ సూచీల ఆధారంగా పంటల ఒత్తిడిని ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. కేంద్ర నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని 410 మండలాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపగా, 388 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు వెల్లడించారు. వీటిలో 283 తీవ్ర కరువు మండలాలు, 105 మోస్తరు కరువు మండలాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 11.2 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో సుమారు 14 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. విపత్తు ప్రతిస్పందన నిధుల (చీణ=ళీ) నిబంధనల ప్రకారం వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాలకు దాదాపు రూ.46 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.110 కోట్లు, తాగునీటి సరఫరా అవసరాలకు నిధులు మంజూరు చేసి రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరారు.

జిల్లాలో రూ.380 కోట్ల సాయం కోరిన కలెక్టర్

అనంతరం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని కరువు పరిస్థితులను వివరించారు. అనంతపురం జిల్లాలోని 32 మండలాలకు గాను 30 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు తెలిపారు. అక్టోబర్ 31 నాటికి సంచిత వర్షపాతం లోటు సుమారు మైనస్ 42 శాతంగా నమోదైందని వెల్లడించారు. దాదాపు 2.29 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని, సుమారు 38 వేల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం కొరత ఉందని వివరించారు. జిల్లా తరఫున ఆరు ప్రధాన విభాగాల కింద దాదాపు రూ.380 కోట్ల కేంద్ర సాయం కోరుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో వ్యవసాయ దిగుబడి నష్టం, వేరుశనగ, ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి సుమారు రూ.280 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే 125 పనిదినాలు పూర్తి చేసుకున్న 39 వేల మంది కూలీలకు అదనపు పనిదినాలు కల్పించేందుకు రూ.61 కోట్లు, పశుగ్రాసం, అనుబంధ అవసరాలకు రూ.24 కోట్లు, తాగునీటి ఎద్దడి నివారణకు రూ.15 కోట్లు, ఐదు మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా పెంపునకు రూ.1.75 కోట్లు ప్రతిపాదించినట్లు నివేదించారు.

ఉద్యాన పంటల నష్టంపై ప్రత్యేకంగా వివరాలు

సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు పలు అంశాలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో బోరుబావులు అధికంగా ఉండటంతో భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడం కష్టంగా మారిందని తెలిపారు. హెచ్‌ఎల్‌సీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ నీటిని రిజర్వాయర్లు నింపడానికే తొలి ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆరుతడి పంటలనే సాగు చేయాలని సూచించామని, వరి సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. గత రెండేళ్లలో 41 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం అమలు చేసి జిల్లా దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని అధికారులు వివరించారు. బత్తాయి, మామిడి, దానిమ్మ వంటి దీర్ఘకాలిక ఉద్యాన తోటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన తోటలకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఏరియా ఎక్స్‌పాన్షన్ కింద సహాయం అందించాలని కేంద్ర బృందాన్ని కోరారు.

సమీపంలోని చెరువులు ఎండిపోవడంతో రైతులు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి తోటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

రాయితీపై నేపియర్ గ్రాస్ పంపిణీ, పీఎండీఎస్ విధానంలో బహుళ విత్తనాల మొలకల ద్వారా పశు గ్రాసం సమకూరుస్తున్నట్లు వివరించారు. వర్షాభావం కారణంగా జూలై మధ్యలో కురిసిన అరకొర వర్షాలతో సాధారణ విస్తీర్ణంలో 60 శాతం మేర మాత్రమే విత్తనాలు పడగా, మిగిలిన 40 శాతం విస్తీర్ణానికి ప్రత్యామ్నాయ ఆరుతడి విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. పంటల మార్పిడి కారణంగా పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకాల కింద బీమా క్లెయిమ్‌ల విషయంలో రైతులకు నష్టం కలగకుండా తగిన తోడ్పాటు అందించాలని కేంద్ర బృందాన్ని జిల్లా యంత్రాంగం కోరింది.

సమీక్షా సమావేశంలో కేంద్ర బృందం సభ్యులతో పాటు రాష్ట్ర నోడల్ అధికారి, వ్యవసాయ శాఖ సంచాలకులు మనజీర్ జీలానీ సమూన్, డాక్టర్ కె.పొన్నుస్వామి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, మహాలనోబిస్ జాతీయ పంట అంచనా కేంద్రం సహాయ సంచాలకులు ప్రభా కాంతి, గ్రామీణాభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ వినోద్ సమంత్, వ్యయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ పంకజ్ పహాడియా, ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణ, మూల్యాంకన డైరెక్టరేట్ డైరెక్టర్ ఎన్.వి.సతీష్ సీమకుర్తి, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్ చంద్, డ్వామా పీడీ శైలజ, సీపీఓ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.







వైసీపీ పని అయిపోయింది

- **కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం**
- **బందరు పోర్టుకు అనుబంధంగా రూ.8 వేల కోట్లతో షిప్‌యార్డ్ ఏర్పాటు**
- **మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**



మచిలీపట్నం (చైతన్య రథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలకు కోతలు, అభివృద్ధికి ఆటంకాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. మచిలీపట్నం సౌత్ మండలంలోని వాడపాలెం, చిన్నవాడపాలెం, వెంకట దుర్గాపురం, సత్యనారాయణపురం, కేపీ పాలెం గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థి కాగిత వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అభ్యర్థులు కూనపరెడ్డి కృష్ణకుమారి, కేశన నాగలక్ష్మితో కలిసి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. 50 ఏళ్లకే పెన్షన్ అందించే నిర్ణయం చంద్రబాబు నాయుడు ఘనత అని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బిడ్డకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి, అన్నదాత సుఖీభవ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామని వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని కొల్లు రవీంద్ర తెలిపారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో కనీస అభివృద్ధి పనులు కూడా జరగలేదని విమర్శిస్తూ, ప్రస్తుతం దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. జలజీవన్ మిషన్ కింద బందరు నియోజకవర్గంలో దాదాపు రూ.75 కోట్లు ఖర్చు చేశామని, కేపీ పాలెం గ్రామానికి రూ.66 లక్షలు మంజూరు చేశామని మంత్రి పేర్కొన్నారు. కోడూరు–ఉల్లిపాలెం బ్రిడ్జి నిర్మాణంతో పాటు బందరు కోట నుంచి గరాలదిబ్బ మీదుగా పోలాటితిప్ప, నడిమేరు, గుండేరు ప్రాంతాల్లో రెండు వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. గ్రామీణ సమస్యలపై అవగాహన ఉన్న నాయకులను ఎన్నుకుంటేనే స్థానిక అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎంపీటీసీ అభ్యర్థి కృష్ణకుమారి, జెడ్పీటీసీ అభ్యర్థి వెంకటేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బందరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి చెప్పారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే మచిలీపట్నం తీరానికి నౌకలు రానున్నాయని పేర్కొన్నారు. పోర్టుకు అనుబంధంగా గోవా షిప్‌యార్డ్ సంస్థ రూ.8 వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు చేయనుందని, దీని ద్వారా సుమారు 10 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వారి విద్యార్హతలకు అనుగుణంగా ఐటీఐలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయగలమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

తొలిరోజే 75,350 సీదరం స్లాట్లలో 60.56 శాతం బుకింగ్‌లు

- **మొత్తం 45,631 స్లాట్లు బుక్..**
- **వినికిడి లోపం విభాగంలో అత్యధికంగా 88.92 శాతం నమోదు**
- **తుపాను బాధితులకు ప్రత్యేక వెసులుబాటు**

అమరావతి (చైతన్య రథం): దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు నవంబర్, డిసెంబర్ నెలలకు ప్రభుత్వం విడుదల చేసిన 75,350 స్లాట్ల బుకింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. తొలిరోజే 45,631 స్లాట్లు బుక్ అయ్యాయి. దీంతో మొత్తం స్లాట్లలో 60.56 శాతం బుకింగ్‌లు పూర్తయ్యాయి. ఇంకా 29,719 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. దివ్యాంగత్వ రకాల వారీగా చూస్తే వినికిడి లోపం విభాగంలో అత్యధికంగా 7,718 స్లాట్లు (88.92 శాతం) బుక్ అయ్యాయి. మానసిక అనారోగ్యానికి సంబంధించి 2,545 (78.55 శాతం), కదలికల వైకల్యానికి 21,802 (72.91 శాతం), అంధత్వానికి 2,008 (69.72 శాతం), తక్కువ చూపునకు 3,679 (42.57 శాతం) స్లాట్లు బుక్ అయ్యాయి.

అత్యల్పంగా బుకింగ్‌లు

యాసిడ్ దాడి బాధితుల విభాగంలో 102 (7.97 శాతం), హీమోఫీలియాకు 139 (10.86 శాతం), కుష్ఠు వ్యాధి నయమైన వారికి 143 (11.17 శాతం), తలసేమియాకు 152 (11.88 శాతం), నిర్దిష్ట అభ్యసన వైకల్యానికి 155 (12.92 శాతం) స్లాట్లు మాత్రమే బుక్ అయ్యాయి.

జిల్లాలవారీగా స్లాట్ల లభ్యత

జిల్లాలవారీగా చూస్తే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2,868 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. విజయనగరంలో 2,754, శ్రీకాకుళంలో 2,677, కృష్ణా జిల్లాలో 2,606, విశాఖపట్నంలో 2,187 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో స్లాట్లు పూర్తిగా బుక్ అయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కేవలం 3, మార్కాపురం జిల్లాలో 108, అనంతపురం జిల్లాలో 131 స్లాట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.



మురసు తుపాను నేపథ్యంలో ప్రత్యేక వెసులుబాటు

మురసు తుపాను ప్రభావంతో నవంబర్ 3, 6 తేదీల్లో నిర్వహించనున్న సదరం వైద్య పరీక్షల శిబిరాలకు స్లాట్ బుక్ చేసుకున్న కొందరు దివ్యాంగులు హాజరుకాలేకపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. తుపాను కారణంగా ఆ తేదీల్లో శిబిరాలకు హాజరుకాలేని వారు ఆరు నెలల్లోపు తమకు కేటాయించిన సంబంధిత ఆసుపత్రికి ఎప్పుడైనా వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. ఆసుపత్రులకు వచ్చే అర్హులైన దివ్యాంగులను వెనక్కి పంపకుండా అదే రోజు వైద్య పరీక్షలు నిర్వహించాలని సంబంధిత ఆసుపత్రులకు సూచనలు జారీ చేశారు. తుపాను సమయంలో ప్రయాణ ఇబ్బందులు పడకుండా, తమ సౌకర్యాన్ని బట్టి తర్వాత వైద్య పరీక్షలకు హాజరుకావాలని ప్రభుత్వం దివ్యాంగులకు విజ్ఞప్తి చేసింది.

చిన్నారి ఘటననూ రాజకీయాలకు వాడుకుంటారా?

జగన్‌పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధ్వజం

- **రాప్తాడు ఘటన నిందితుడికి మద్దతుగా పిటిషన్ వేయించారని ఆరోపణ..**
- **మహిళల భద్రతపై మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదని విమర్శ**

మంగళగిరి (చైతన్య రథం): రాప్తాడు ఘటనలో బాధిత చిన్నారికి న్యాయం జరగాల్సిన సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు హేమంత్‌కు మద్దతుగా వైసీపీ నేతలు, న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారని ఆరోపించారు. బాధితురాలి పరిస్థితిని రాజకీయాలకు వాడుకోవడం, మరోవైపు నిందితుడికి న్యాయ సహాయం అందించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఒకవైపు జగన్ బెంగళూరులోని ఆస్పత్రికి వెళ్లి బాధిత చిన్నారిని పరామర్శిస్తుంటే, మరోవైపు వైసీపీకి చెందిన వ్యక్తులు నిందితుడికి మద్దతుగా కోర్టును ఆశ్రయించారని ఆరోపించారు. మంగళగిరికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు గోపీకృష్ణతో కలిసి, గతంలో ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌లో పనిచేసిన న్యాయవాది సాల్మన్ రాజు ద్వారా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వైసీపీ నాయకత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఘటన జరిగిన వెంటనే మంత్రి నారా లోకేష్ స్పందించి, చిన్నారిని మెరుగైన వైద్యం కోసం గ్రీన్ ఛానల్ ద్వారా బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారని మాధవి తెలిపారు. చిన్నారికి అత్యుత్తమ వైద్యం అందించే బాధ్యత తీసుకోవడంతో పాటు, ముఖ్యమంత్రి కూడా వైద్యులతో మాట్లాడి పరిస్థితిని పర్యవేక్షించారని చెప్పారు. ఇలాంటి సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి, చిన్నారి పేరుతో రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే సహాయం అందిస్తుండగా, మళ్లీ మీడియా ముందు పరిహారం, వైద్యం గురించి డిమాండ్లు చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు.



రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని జగన్ చేస్తున్న విమర్శలను ఆమె ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, గంజాయి, డ్రగ్స్ సమస్యలు పెరిగాయని ఆరోపించారు. అమరావతి ఉద్యమ సమయంలో మహిళా రైతులపై జరిగిన పోలీసు చర్యలను, ప్రతిపక్ష కార్యాలయంపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ.. అప్పట్లో శాంతిభద్రతల గురించి జగన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నేరస్థులకు, అరాచక శక్తులకు వైసీపీ నాయకత్వం అండగా నిలుస్తోందని విమర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇచ్చారని, ఆధునిక పోలీసు వ్యవస్థను బలోపేతం చేశారని మాధవి పేర్కొన్నారు. వైసీపీ హయాంలో గంజాయి, కల్తీ మద్యం సమస్యలు పెరిగాయని ఆరోపిస్తూ, వాటిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. నార్కోటిక్స్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఈగల్ బృందాలను రంగంలోకి దించిందని చెప్పారు. బాధిత చిన్నారిని పరామర్శించే సమయంలోనూ జగన్ రాజకీయ ప్రయోజనాల గురించి ఆలోచిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడంలో పార్టీలకు తావుండకూడదని, చిన్నారి త్వరగా కోలుకుని సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. మహిళల భద్రత, బాధితులకు న్యాయం వంటి సున్నితమైన అంశాలను రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని జగన్‌కు హితవు పలికారు. నేరస్థులకు మద్దతుగా నిలిచే రాజకీయాలను ప్రజలు, ముఖ్యంగా మహిళలు సహించరని గళ్ళా మాధవి హెచ్చరించారు.

2021లో విధ్వంసం..

నేడు ప్రశాంతంగా పోలింగ్

- **అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు ప్రజాస్వామ్యబద్ధమన్న జగన్..**
- **ఇప్పుడు వాటిపైనే విమర్శలు చేయడం అవకాశవాద రాజకీయమే**
- **గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ విమర్శ**

మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ తీవ్రంగా తప్పుబట్టారు. 2021లో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలకు, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రశాంత వాతావరణానికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత జగన్ ఏకగ్రీవాలపై అనుమానాలు వ్యక్తం చేయడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రజల



స్వచ్ఛంద మద్దతుగా అభివర్ణించిన జగన్, ఇప్పుడు అవే ఏకగ్రీవాలు బలవంతంగా జరుగుతున్నాయంటూ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమకు అందుబాటులో ఉండే, తమ సమస్యలను పరిష్కరించే నాయకులను స్వచ్ఛందంగా ఎన్నుకునే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని భావిస్తే ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని, మీడియా ముందు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

పులివెందులలో ఘర్షణలకు జగన్ వైఖరే కారణం

పులివెందులలో ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 92 స్థానాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే పులివెందులలో మాత్రమే ఉద్రిక్తతలు ఎందుకు చోటుచేసుకున్నాయని ప్రశ్నించారు. ఈ పరిణామాలకు జగన్ వైఖరే కారణమని ఆరోపించారు. బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చి వీధివీధినా ప్రచారం చేయడంతో పాటు, ఆర్వో కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించి అనవసర రాద్ధాంతం సృష్టించారని విమర్శించారు. పోలింగ్ సమయంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బూతుల్లోకి పంపకుండా తన వెంట తిప్పుకున్నారని ఆరోపించారు.

గతంలో భయాందోళనల మధ్య ఓటు వేసిన ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే ప్రజల తీర్పుగా, ఓడిపోతే ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేయడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు.

మైనార్టీల రాజకీయ ఎదుగుదలను జగన్ ఓర్చుకోలేకపోతున్నారు

ముస్లిం మైనార్టీలు రాజకీయంగా ఎదుగుతుండటాన్ని జగన్ ఓర్చుకోలేకపోతున్నారని నసీర్ అహ్మద్ ఆరోపించారు. పుంగనూరు, రాయచోటి, పులివెందుల, ఆళ్లగడ్డ వంటి ప్రాంతాల్లో మైనార్టీ అభ్యర్థులు రాజకీయంగా ముందుకు వస్తుంటే, వారి విజయాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారని విమర్శించారు. పుంగనూరు మున్సిపాలిటీలో నయీమ్ తాజ్, రాయచోటిలో ఖాదర్ వలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఆళ్లగడ్డలో షేక్ అనీషా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా విజయం సాధించగా, పిడుగురాళ్లలో షేక్ బాబావలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. మైనార్టీ నాయకులకు ప్రజలు పదవులు కట్టబెడుతుంటే వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో స్వేచ్ఛగా నామినేషన్లు వేసి, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియపై జగన్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

రాబోయే రోజుల్లోనూ ప్రజలంతా స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నసీర్ అహ్మద్ కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

‘చింత తీర్చనున్న’ చింతలపూడి!

ఆకాశం వైపు ఆశగా చూసే రైతులు, చినుకు కోసం ఎదురుచూసే నేల, నీటి జాడ లేక బీడువారిన పొలాలు. ఇదీ దశాబ్దాలుగా పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంత రైతుల దైన్యస్థితి. గోదావరి నది కళ్లముందే పరవళ్లు తొక్కుతున్నా.. ఆ జలాలను తమ పొలాలకు మళ్లించుకోలేని దురదృష్టం వారిది. నదిలో పుష్కలంగా నీళ్లున్నా తమ భూములకు మాత్రం కన్నీళ్లే మిగిలాయన్నది రైతుల ఆవేదన. తరాలు మారాయి. ప్రభుత్వాలు మారాయి. ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. కానీ రైతుల సాగునీటి కల మాత్రం సాకారం కాలేదు.

ఇటువంటి పరిస్థితుల్లో గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి మళ్లించి లక్షలాది ఎకరాలకు జీవజలాలను అందించాలన్న ఆశయంతో రూపుదిద్దుకున్నదే చింతలపూడి ఎత్తిపోతల పథకం. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల మెట్ట ప్రాంత రైతుల ఆశలకు చింతలపూడి ఎత్తిపోతల పథకం జీవం పోయనుంది. గోదావరి జలాలను ఎత్తిపోసి కరువు ఛాయలను తరిమికొట్టి, బీడుభూములను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు కేవలం ఒక సాగునీటి పథకం మాత్రమే కాదు. వేలాది రైతు కుటుంబాలలో సిరులు కురిపించే జీవనాడి. ఎన్నో ఏళ్లుగా నిధుల కొరత, పాలకుల నిర్లక్ష్యం, పనుల్లో జాప్యంతో రైతుల ఆశలను నీరుగార్చిన ఈ ప్రాజెక్టును పూర్తిచేసి రైతాంగానికి అంకితం చేయాలన్న సంకల్పం నెరవేరితే మెట్ట ప్రాంతం రూపురేఖలే మారనున్నాయి.

పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేపట్టడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2019లో అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండా పనులు కొనసాగించవద్దని ఎన్‌జీటీ ఆదేశించడంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. ప్రాజెక్టు పనులు నిలిచిపోవడానికి పర్యావరణ, న్యాయపరమైన సమస్యలు ప్రధాన కారణాలు. వాటిని పరిష్కరించకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాలేదు. ఒక ప్రాజెక్టును ప్రారంభించడం ఎంత ముఖ్యమో, ఏళ్ల తరబడి న్యాయపరమైన, పర్యావరణపరమైన అడ్డంకుల్లో చిక్కుకున్న ప్రాజెక్టుకు అనుమతులు సాధించి మళ్లీ పట్టాలెక్కించడం అంతకంటే గొప్ప విషయం.

సాగునీటి ప్రాజెక్టులు కేవలం కాంక్రీటు నిర్మాణాలు కావు. అవి రైతుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జీవనాడులు. సాగు, తాగునీటి కోసం ప్రజలు అల్లాడటం పాలకుల దార్శనికతకు సవాలు. అలాంటి లక్షలాది ఎకరాల భూములకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం ఏళ్ల తరబడి అడ్డంకుల్లో చిక్కుకోవడం ఆంధ్రప్రదేశ్ దురదృష్టం. నేడు సీఎం చంద్రబాబు పట్టుదల, న్యాయపోరాటం, కేంద్రంతో సంప్రదింపుల ఫలితంగా పర్యావరణ, అటవీ అనుమతులు లభించడంతో ఈ ప్రాజెక్టుపై కొత్త ఆశలు చిగురించాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్టుకు లభించిన అనుమతి కాదు. గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్న వేలాది రైతు కుటుంబాల ఆశలకు లభించిన ఊరట.

ఇది సీఎం చంద్రబాబు పట్టుదలకు ఫలితం!

వాటర్ మ్యాన్ చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయం. సుప్రీంకోర్టులో జరిగిన న్యాయపోరాటం, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖతో సంప్రదింపుల అనంతరం చింతలపూడికి 2026 అక్టోబరు 31న అనుమతులు లభించడం హర్షణీయం. ఇది సీఎం చంద్రబాబు పట్టుదలకు ఫలితం. అభివృద్ధి అంటే శంకుస్థాపనలు చేయడం కాదు.. అడ్డంకులను అధిగమించి ప్రాజెక్టులను పూర్తి చేయడం. గతంలో ప్రారంభమైన అనేక సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబుకు ప్రత్యేక అనుభవం ఉంది. ఇప్పుడు చింతలపూడి విషయంలోనూ అదే పట్టుదల చూపించారు. న్యాయస్థానాల్లో పోరాటం, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు, పర్యావరణ, అటవీ అనుమతుల సాధన ద్వారా ప్రాజెక్టుకు ఎదురైన ప్రధాన అడ్డంకులను తొలగించడంలో చంద్రబాబు ప్రభుత్వం విజయం సాధించింది. ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు పరిణామాల అనంతరం అనుమతులు లభించడం నిర్మాణానికి కీలక మలుపు.

గోదావరి నదిలో ఏటా లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోంది. మరోవైపు గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనే వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఈ వైరుధ్యానికి పరిష్కారం చూపగలిగే ప్రాజెక్టే చింతలపూడి ఎత్తిపోతల పథకం.

మొత్తం పది నియోజకవర్గాలకు ప్రయోజనం

పోలవరం ప్రాజెక్టు దిగువన గోదావరి వరద జలాలను వినియోగించుకొని తాగు, సాగునీటి ఎద్దడిని తీర్చడానికి ప్రతిపాదించిన అత్యంత కీలకమైన బహుళార్థసాధక పథకం చింతలపూడి ఎత్తిపోతల పథకం. తూర్పు గోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, తాడిపూడి గ్రామం వద్ద గోదావరి నదిపై (పోలవరం ప్రాజెక్టుకు 14.8 కి.మీ. దిగువన) నిర్మించబడుతోంది. వరద సమయంలో మూడు నెలల పాటు గోదావరి మిగులు జలాలను ఎత్తిపోసి మెట్ట, మరియు ఆయకట్టు చివరి భూములకు అందించడం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రధానంగా నాగార్జున సాగర్ ఎడమ కాలువ టెయిల్ పాండ్ చివరి భూములకు, రైతులకు సంజీవని వంటిది.

తరచూ కృష్ణా బేసిన్‌లో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు గోదావరి జలాలతో ఆయకట్టు స్థిరీకరణ 2.80 లక్షల ఎకరాలు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు 2.10 లక్షల ఎకరాలు, తమ్మిలేరు జలాశయం పరిధిలో 28,000 ఎకరాలు, ఎర్రకాలువ జలాశయం పరిధిలో 27,000 ఎకరాలు, కొవ్వాడ కాలువ జలాశయం పరిధిలో 17,000 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. కాలువ మార్గమధ్యంలో ఉన్న 410 గ్రామాల్లో 25.94 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా అందించనున్నారు.

ఏలూరు, తూర్పు గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా.. నాలుగు జిల్లాల్లో మొత్తం 10 నియోజకవర్గాలు, 35 మండలాలకు ఈ ప్రాజెక్టు ప్రయోజనం చేకూర్చనుంది. పోలవరం, చింతలపూడి, దెందులూరు, ఏలూరు, నూజివీడు, గోపాలపురం, తిరువూరు, మైలవరం, నందిగామ, గన్నవరం నియోజకవర్గాలకు ప్రయోజనం కలగనుంది.

చింతలపూడి ప్రాజెక్టు ఆలోచన కొత్తదేమీ కాదు. 2008లో సుమారు రూ.1,701 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ పథకం అనేక కారణాలతో ఆలస్యమైంది. 2016లో అంచనా వ్యయం రూ.4,909.80 కోట్లకు పెరిగింది. భూసేకరణ చట్టం-2013, స్టీల్, సిమెంట్ ధరల సర్దుబాటు కారణంగా రెండో సవరణ అంచనా రూ.8,075 కోట్లకు పెరిగింది. 53 టీఎంసీల గోదావరి జలాలు, 1,94,254 హెక్టార్ల మొత్తం ఆయకట్టు, 80,939 హెక్టార్ల కొత్త ఆయకట్టుకు కూడా ఈ ప్రాజెక్టు ప్రయోజనం చేకూర్చనుంది. 2014 నుంచి 2019 వరకు రూ.3,039 కోట్ల విలువ చేసే పనులు జరిగి 40 శాతం పురోగతి నమోదైంది. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ.761 కోట్లతో నామమాత్రపు పనులు చేశారు.

కరువు రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం కావాలి

చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే రైతుల చింత తీర్చడమే కాదు. వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పులు రానున్నాయి. వర్షాలపై ఆధారపడే రైతులకు సాగునీటి భరోసా లభిస్తుంది. బీళ్లుగా ఉన్న భూములు పచ్చని పంట పొలాలుగా మారనున్నాయి. పంటల దిగుబడి పెరుగుతుంది. వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తుంది. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. పశుపోషణ, ఆహార శుద్ధి పరిశ్రమలు, చిన్న వ్యాపారాలకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

53 టీఎంసీ నీటిని సద్వినియోగం చేసుకుని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తే ఈ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుంది. వాటర్ మ్యాన్ చంద్రబాబు గోదావరి జలాలను మెట్ట ప్రాంతాల పొలాల్లో పారించి రైతుల ఇళ్లల్లో సిరులు కురిపించాలి. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం సరికొత్త ప్రగతి బాటలో పయనించాలి. అనుమతులు రావడం మొదటి విజయం మాత్రమే. నిధుల సమీకరణ, పనుల నిర్వహణ, భూసేకరణ, కాలువల నిర్మాణం, పంపింగ్ వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాలను సమన్వయంతో పూర్తి చేయాలి.

చింతలపూడి ఎత్తిపోతల పథకం మొదటి దశను పూర్తి చేయడం ద్వారా గోదావరి వరద జలాలను కృష్ణా డెల్టా మరియు నాగార్జున సాగర్ ఆయకట్టుకు మళ్లించి రాష్ట్రంలో కరువు రహిత వాతావరణాన్ని సృష్టించవచ్చు. 2026 అక్టోబరు 31న పర్యావరణ అనుమతి లభించడం ప్రాజెక్టు పునరుజ్జీవనానికి చారిత్రాత్మక మైలురాయి. ప్రభుత్వం నిర్దేశించిన 2027 జూన్ 30 గడువు నాటికి ఫేజ్-1 పనులను పూర్తి చేసి చింతలపూడి చింత తీర్చాలి.

- నీరుకొండ ప్రసాద్

ఆత్మీయుల అశ్రునివాళి మధ్య దివంగత నేత ఎర్రన్నాయుడు వర్ధంతి

●14వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కుటుంబ సభ్యులు



కోటబొమ్మాళి (చైతన్యరథం): దివంగత దిగ్గజ నేత, మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 14వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఆయన స్వగ్రామమైన నిమ్మాడలో అత్యంత భావోద్వేగ వాతావరణంలో జరిగింది. ఆధునికీకరించిన స్మృతివనం వద్ద కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు, అభిమానులు ఎర్రన్నాయుడును స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు హరివరప్రసాద్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కింజరాపు ప్రభాకర్ ఎర్రన్నాయుడు సతీమణి విజయమ్మ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు, అభిమానులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. స్మృతివనం వద్ద పుష్పాంజలి ఘటించి ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన విశేష సేవలను, రాజకీయ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గం, ఆశయాలు చిరస్మరణీయమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. వర్ధంతి సందర్భంగా నిమ్మాడకు తరలివచ్చిన అభిమానులు, పార్టీ ముఖ్య శ్రేణులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో హాజరై ఎర్రన్నాయుడుకు నివాళులర్పించారు. అనంతరం కింజరాపు కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కింజరాపు కుటుంబీకులు, బంధువులు, ఆత్మీయులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు మామిడి గోవిందరావు, పార్టీ సీనియర్ నాయకులు బోయిన గోవిందరాజులు, అరవల రవీంద్ర, వెలమల కామేశ్వరరావు, శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో ఎడతెరిపిలేని వర్షం... పొంగిన వట్టిగెడ్డ జలాశయం పొర్లు కాలువ



పాడేరులో దంచికొడుతున్న వర్షం

రాజవొమ్మంగి (చైతన్యరథం): రాజవొమ్మంగిలో సోమవారం ఉదయం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. రాజవొమ్మంగి శివారున వట్టిగెడ్డ జలాశయం పొర్లుకాలువ ఉధృతంగా ప్రవహించింది. శాంతినగర్, శ్రీరామ్‌నగర్, వయ్యేడు, బూరుగుపల్లి, ముర్లవానిపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పొంగిన ప్రతీసారి రాకపోకలు నిలిచిపోతున్నాయని, వ్యవసాయ పనులకు వెళ్లలేకపోతున్నామని ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు పాట్లు తప్పడం లేదని, అత్యవసర సమయంలో వాహనాలు సైతం రాక ఇబ్బందులు పడుతున్నామని రాజవొమ్మంగితో పాటు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా దశాబ్దాల కాలంగా వంతెన నిర్మాణం చేపట్టలేదని, ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తగుచర్యలు చెప్పట్టాలని కోరుతున్నారు.

పాడేరులో వర్షం దంచికొడుతుంది. అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం నాటికి భారీ వర్షంగా మారింది. వివిధ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఎన్నికల ప్రచారానికి వర్షం అడ్డంకిగా మారింది. అర్నబ్ తుపాను దెబ్బకు పలు రోడ్లు ధ్వంసం కాగా ఇప్పటికే కొన్ని అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో మరో తుపానుతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది.

పురపోరు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి...

ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు...



అమరావతి (చైతన్యరథం): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగరపంచాయతీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత వార్డు, మేయర్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల కౌంటింగ్ చేపడతారు. ఈసారి మేయర్ స్థానానికి కూడా ప్రత్యక్ష పద్ధతిలోనే ఓటింగ్ నిర్వహించిన నేపథ్యంలో వార్డులతోపాటు మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు ఉంటుంది.

సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు :

రాష్ట్రవ్యాప్తంగా 3,942 వార్డులు, డివిజన్లు ఉన్నాయి. వీటిలో కార్పొరేషన్లలో 922, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 3020 డివిజన్లు, వార్డులు ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. సంబంధిత అభ్యర్థితోపాటు ఏజెంట్, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌లను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. మంగళవారం మధ్యాహ్నానికి కౌంటింగ్ ట్రెండ్స్ వచ్చే అవకాశం ఉంది. రాత్రికి పూర్తి ఫలితాలు వెలువడొచ్చు. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ద్వారా పరోక్ష పద్ధతిలో నవంబర్ 5, 6 తేదీల్లో డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది.

పటిష్ట బందోబస్తు

ఏలూరులోని వట్లూరులో ఉన్న CR రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్‌లను నగర పాలక సంస్థ అడిషనల్ ఎలక్షన్ అథారిటీ అధికారి భాను ప్రతాప్ పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 5 గంటలకు కేంద్రానికి చేరుకోవాలన్నారు. తొలి విడతలో 31 డివిజన్ల ఫలితాలు, ఆ తర్వాత మరో 31 డివిజన్ల రిజల్ట్స్ వెల్లడిస్తామని తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో స్ట్రాంగ్ రూమ్ వద్దపోలీసులు నిరంతరం నిఘా కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఐడీ కార్డులు కలిగిన వారిని మాత్రమే అనుమతిస్తామని డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. డాక్టర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో పోలయిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ముమ్మిడివరంలోని జీఎంసీ బాలయోగి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ నదియాదేవి పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియ కొనసాగేటప్పుడు ఏ విధమైన ఆటంకాలు, గొడవలు జరగకూడదని పోలీసులకు సూచించారు. ప్రధాన ద్వారాలను మూసివేసి గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి : మంత్రి అనిత

● పాయకరావుపేటలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం



పాయకరావుపేట (చైతన్యరథం): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓటేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. విశాఖ జిల్లా పాయకరావుపేటలో సోమవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల వ్యయంతో రోడ్లకు కొత్త రూపు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. సంక్షేమ, అభివృద్ధితోపాటు పరిశ్రమల స్థాపనతో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచి, ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నగేష్, బోడపాటి శివధత్, వరహాల బాబు, రాజబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ శ్రేణుల వలసల వెల్లువ

●మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరికలు



కోటబొమ్మాళి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా వైకాపా పార్టీ శ్రేణులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వలసల పరంపర కొనసాగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో సంతబొమ్మాళి మండలం ఇజ్జుపురం పంచాయతీ పరిధిలోని ఇజ్జుపురం గ్రామం, టెక్కలి మండలం పాతనౌపడ గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారందరికీ మంత్రి అచ్చెన్నాయుడు పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తూ పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పాలన సాగుతోందని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు విద్యారంగంలో సంస్కరణలు, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని వారు కొనియాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వారు వెల్లడించారు.

ఏపీలో 4,5 తేదీల్లో సెలవు ప్రకటించిన ప్రభుత్వం.. ఉత్తర్వులు జారీ

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. ఇప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వంతు వచ్చింది. ఈ నెల 5న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కారణంగా ఉద్యోగులకు ఈనెల 4, 5 తేదీల్లో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. పోలింగ్ ఏర్పాట్ల కోసం బుధవారం.. పోలింగ్‌కు సంబంధించి గురువారం సెలవుగా నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే స్కూళ్లకు కూడా సెలవులు ప్రకటిస్తారు. అలాగే పరిషత్ పోలింగ్ రోజున ఉద్యోగులు, కార్మికులకు సెలవు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. నవంబర్ 35 ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ కారణంగా ఆ ప్రాంతాల పరిధిలోని ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు ఈ సెలవుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. నవంబర్ 5నన పోలింగ్ రోజు మాత్రమే కాదు.. ఒక రోజు ముందు నవంబర్ 4న స్థానిక సెలవు ప్రకటించనున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తించనున్నాయి.

ముంచుకొస్తున్న మురుసు తుఫాన్... కంట్రోల్ రూమ్ నంబర్లు ఏర్పాటు

అమరావతి (చైతన్యరథం): మురసు తుఫాన్ ముంచుకొస్తుంది. నేటి సాయంత్రం నెల్లూరు – ఒంగోలు మధ్య ఈ తుఫాన్ తీరం దాటనుంది. దీంతో కృష్ణా, పెన్నా బేసిన్లలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపించనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆర్టీజీఎస్ (RTGS) నుంచి సీఎం చంద్రబాబునాయుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. అలాగే వివిధ శాఖల మంత్రులు.. ఆయా శాఖల ఉన్నతాధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ: మంత్రి గొట్టిపాటి

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ జరగాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి అదనపు సిబ్బంది, యంత్రాలు తెప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫ్లడ్ కంట్రోల్ సెల్స్ ఏర్పాటు: మంత్రి నిమ్మల

రిజర్వాయర్లలో నీటి ప్రవాహాలను ప్రతి రెండు గంటలకూ ఒకసారి గమనించాలని అధికారులను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖల సమన్వయంతో ఫ్లడ్ కంట్రోల్ సెల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాగులు, వంకల వద్ద జన సంచారాన్ని నిలిపివేయాలని సూచించారు. తుఫాన్ వేళ.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

కంట్రోల్ రూమ్ నంబర్లు..

సీఆర్డీఏ (CRDA) సర్కిల్: 8331092947, చిలకలూరిపేట: 9491052943, మంగళగిరి: 6281703602, పల్నాడు సర్కిల్: 7661019447, మాచర్ల: 9440817531, నరసరావుపేట: 9440817539, మార్కాపురం సర్కిల్: 7780420711, కనిగిరి: 9440812364, మార్కాపురం: 9440817509, గిద్దలూరు: 8247722971, ఎన్టీఆర్ సర్కిల్: 9440817561, విజయవాడ రూరల్: 7382623229, విజయవాడ టౌన్: 7382623226, నూజివీడు: 7382623224, గుణదల: 9491052947, ప్రకాశం సర్కిల్: 9440817491, ఒంగోలు: 9440817495 అద్దంకి: 9490611613, దర్శి: 9491065264, కందుకూరు: 9491052950, బాపట్ల సర్కిల్: 9281413774, బాపట్ల: 9491052945, చీరాల: 9440817597, గుంటూరు సర్కిల్: 9440817526, గుంటూరు: 9440817527, తెనాలి: 9440817535, కృష్ణా సర్కిల్: 6281709355, మచిలీపట్నం: 8672222294, ఉయ్యూరు: 7382623231, గుడివాడ: 9440817573. –

పలు ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో మురసు తీవ్ర తుపాను కొనసాగుతోంది. ఆరు గంటలుగా గంటకు 10 కిలోమీటర్ల వేగంతో వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం నెల్లూరుకు 100 కిలోమీటర్లు, కావలికి 120 కిలోమీటర్లు, చెన్నైకి 160 కిలోమీటర్లు, ఒంగోలుకు 160 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 210 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. తీవ్ర తుపాను మురసు కదలికలను చెన్నై, మచిలీపట్నం, విశాఖ డాప్లర్ వాతావరణ రాడార్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తుపాను దగ్గరకు వచ్చే కొద్ది అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

తుపాను దృష్ట్యా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంగళవారం బాపట్ల జిల్లాలోని విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు సూర్యలంక బీచ్‌ను మూసివేశారు. బీచ్‌కు పర్యాటకులు రావొద్దని అధికారులు హెచ్చరించారు. మరోవైపు తుపాను ప్రభావిత జిల్లాల్లో అధికారులు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో 9440827526 (గుంటూరు), 9281413774 (బాపట్ల) నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

మురసు తుపానుపై అప్రమత్తంగా ఉన్నామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని చెప్పారు. తుపాను కారణంగా రానున్న మూడురోజుల పాటు దక్షిణకోస్తాలో భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఈ క్రమంలో ప్రజలందరూ ఇళ్లలోనే ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. మరోవైపు మురసు తీవ్ర తుపానుతో పలు ఓడరేవుల్లో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

పలు రైళ్లు రద్దు : మురసు తుపాను దృష్ట్యా విజయవాడ డివిజన్‌లో 9 రైళ్లను రద్దు చేశారు. నేడు వెళ్లాల్సిన విజయవాడ–గూడూరు, గూడూరు–విజయవాడ గుంటూరు–తెనాలి, తెనాలి–గుంటూరు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవాళ వెళ్లాల్సిన తెనాలి–రేపల్లెతో పాటు నేడు వెళ్లాల్సిన రేపల్లె–మార్కాపురం రోడ్డు రైలు, మార్కాపురం రోడ్డు–రేపల్లె రైలును రద్దు చేశామని వివరించారు.

పార్టీలోకి చేరికలు... ఆహ్వానించిన ఎమ్మెల్యేలు కూన, గొండు

శ్రీకాకుళం (చైతన్యరథం): పల్లెల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గోనెపాడు గ్రామంలో పర్యటించారు. గత రెండున్నరేళ్లలో ఆమదాలవలస నియోజక వర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గోనెపాడు గ్రామంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. గొండు లక్ష్మణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పేడాడ రామ్మోహన్, టీడీపీ నాయకులు నూక కోటేశ్వరరావు, సనపల రాజు, నూక ప్రభాకర్, సనపల వెంకటరమణారావు, సింగురపు దివ్య రామచంద్రరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే గొండు శంకర్

తూలుగు పంచాయతీ చేకుల్లపేట, ఉప్పరపేట గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఈ మేరకు గ్రామంలో



వారికి ఎమ్మెల్యే గొండు శంకర్ పార్టీ కండు వాలను వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

తునిలో భారీ వర్షం... జలమయమైన పలు ప్రాంతాలు



తుని (చైతన్యరథం): మురసు తుపాను ప్రభావంతో కాకినాడ జిల్లా తునిలో భారీ వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వానకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతు బజారులో నీరు నిల్వతో ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వ్యాపారులు వర్షంలో తడిచి ముద్దయ్యారు. విద్యార్థులకు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందిపడాల్సి వచ్చింది. పలు ప్రాంతాల్లో వాహనదారులకు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయింది. తొండంగి మండలం వ్యాప్తంగా తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటీవల అర్నబ్ తుపానుతో జిల్లా అతలాకుతలమైంది. అందులో నుంచి తేరుకోకముందే మురసు తుపాను వచ్చి పడటంతో జిల్లా వాసులు ఆందోళన పడుతున్నారు.

కూటమి అభ్యర్థుల్ని గెలిపించండి : టీడీపీ ఎంపీ శ్రీ భరత్ పిలుపు

విజయనగరం (చైతన్యరథం): గ్రామాల్లో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విశాఖ ఎంపీ శ్రీ భరత్ కోరారు. సోమవారం జామి మండలంలో ఆయన కూటమి అభ్యర్థుల తరపున ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి ప్రచారం నిర్వహించారు. రెండేళ్ల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని వివరించారు. తెర్లాం మండలంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి సిరి సహస్ర ప్రచారం నిర్వహించారు. జడ్పీ మాజీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయింది : మంత్రి కొల్లు రవీంద్ర

●కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపాం

●గొడ్డలి పార్టీ పాలనలో సంక్షేమంలో కోతలు.. అభివృద్ధి వాతలు తప్ప ఇంకేం లేదు

●మచిలీపట్నం రూరల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి ప్రచారంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం సౌత్ మండలం మండలం వాడపాలెం, చిన్నవాడపాలెం, వెంకట దుర్గాపురం, సత్యనారాయణపురం, కెపిటిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థి కాగిత వెంకటేశ్వరరావు ఎంపీటీసీ అభ్యర్థి కూనపరెడ్డి కృష్ణ కుమారి, కేశన నాగ లక్ష్మీతో కలిసి ప్రజల్లోకి వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. 50 సంవత్సరాలకే పెన్షన్ ప్రవేశపెట్టిన ఘనత కూడా చంద్రబాబునాయుడుకే దక్కుతుంది. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బిడ్డకూ రూ. 15,000 చొప్పున అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు అందిస్తున్నాం. మత్స్యకారులకు వేట నిషేధ భృతి, అన్నదాత సుఖీభవ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాం.

డ్రైనేజీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి లక్ష్యంగా గత అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. గత ఐదు సంవత్సరాలు కనీసం ఒక పార మట్టి తీయని పరిస్థితి నుంచి, నేడు దశలవారీగా రోడ్లన్నీ పూర్తి చేశాం. వచ్చే సంవత్సరం నుండి డ్రైనేజీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా రోడ్లపై నిలబడకుండా, మురుగు లేకుండా చేసే బాధ్యత తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికీ తాగునీటి కులాయి ఏర్పాటు చేస్తున్నాం. ఆ కార్యక్రమాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. జలజీవన్ మిషన్ కింద బందరు నియోజకవర్గంలో దాదాపు రూ.75 కోట్లు ఖర్చు చేశాం. కె.పి.పాలెం గ్రామానికి రూ.66 లక్షలు మంజూరయ్యాయి. కోడూరు – ఉల్లిపాలెం బ్రిడ్జ్, కోడూరు, నాగలంక, అవనిగడ్డ డెల్టా ప్రాంతంలో ఆనాడు చంద్రబాబునాయుడు ఉల్లిపాలెం బ్రిడ్జ్ నిర్మించారు. బందర్ కోట నుంచి గరాలదిబ్బ మీదగా పోలాటితిప్ప, నడిమేరు, గుండెరు వద్ద రెండు వంతెనల నిర్మాణం జరుగుతున్నాయి. గ్రామాల్లో సమస్యలు తెలిసిన వారు నాయకులుగా ఉన్నపుడే అభివృద్ధి జరుగుతుంది. ఎం.పి.టీ.సి.గా కృష్ణకుమార్, జెడ్పీటీసీగా వెంకటేశ్వరరావుని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుకుంటున్నాము.



పది వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ఏర్పాట్లు

బందరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. బందరు పోర్టు నిర్మాణాన్ని ఇప్పటికే ప్రారంభించాం. వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. మచిలీపట్నానికి త్వరలోనే ఓడలు రాబోతున్నాయని చెప్పడానికి గర్వంగా ఉంది. బందరు పోర్టుకు అనుబంధంగా గోవా షిప్‌యార్డ్ సంస్థ రూ.8,000 కోట్ల పెట్టుబడితో 10,000 మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ఏర్పాటు కాబోతోంది. తద్వారా మన యువతకు ఎక్కువ ఉద్యోగాలు వస్తాయి. పిల్లల చదువులకు తగ్గట్టుగా ఐటీఐలు మరియు స్కిల్ డెవలప్‌మెంట్ చేసి మన పిల్లలకే ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ చేపడుతున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లో కూటమి ప్రభుత్వం ఉంటే ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ నడిపించి, అభివృద్ధిని వేగవంతం చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

కూటమి ఐక్యతే మన బలం - ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ నియోజకవర్గం, నూజెండ్ల మండలం త్రిపురాపురం, గొల్లపాలెం, ములకలూరు, పువ్వాడ, కొండలరాయుడుపాలెం గ్రామాలలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి వెంకట బాలప్రసాద్ విజయం కోరుతూ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రచారం నిర్వహించారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... మిత్ర ధర్మాన్ని పాటిస్తూ జనసేన పార్టీ తరఫున గ్లాసు గుర్తుపై పోటీ చేస్తున్న జడ్పీటీసీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి ఐక్యతే మన బలమని, 2029లో మరోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నిశంకర శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

చెప్పాం - చేస్తున్నాం... ఇంటింటి ప్రచారంలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య



చీరాల (చైతన్యరథం): చీరాల నియోజకవర్గంలో కూటమి హవా కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య చీరాల మండలం ఈపురుపాలెం తోటవారిపాలెం గ్రామాల్లో పర్యటించారు. చీరాల మండలం జడ్పీటీసీ కూటమి అభ్యర్థి నాసిక మణికుమార్, ఎంపీటీసీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచార కార్యక్రమం సాగింది. ప్రభుత్వం ఏర్పడి నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను 90% అమలు చేశామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. నిధులు లేకుండా చేసింది. మా కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు నిధులు విడుదల చేశాం. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నాం. జగన్ 5 ఏళ్ల పాలనలో గ్రామాలను నాశనం చేశాడు. పంచాయతీ నిధులను దారి మళ్లించి గ్రామాల్లో అరాచకం సృష్టించాడు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేశాడు. యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి గంజాయి, డ్రగ్స్ కి బానిసలను చేశాడు. అమరావతిని చంపేసి 3 రాజధానుల నాటకంతో రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశాడు. చీరాల నియోజకవర్గానికి ఒక్క నిధి కూడా ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డాడు. అలాంటి అరాచక పాలనకు ప్రజలు 2024లోనే బుద్ధి చెప్పారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కూడా వైసీపీకి ఓటు వేస్తే మళ్ళీ అదే అన్యాయం జరుగుతుందని ప్రజలే చెబుతున్నారు" అని ఎమ్మెల్యే అన్నారు. గ్రామ పంచాయతీల నిధులు లూటీ – సర్పంచులను బలి చేశాడు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల భూములు లాక్కోవాలని చూశాడు. చీరాలకి ఒక్క అభివృద్ధి పని చేయలేదు. ఐదేళ్లు అన్యాయం చేసిన వైసీపీకి... స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెబుదాం!. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న మండల గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెప్పాం... చేస్తున్నాం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి (చైతన్యరథం): సత్తెనపల్లి నియోజకవర్గంలో కూటమి హవా కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి రూరల్ మండలం కందులవారిపాలెం మరియు భృగుబండ గ్రామాల్లో పర్యటించారు. "చెప్పాం – చేస్తున్నాం" కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రభుత్వం ఏర్పడి నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను 90% అమలు చేశామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నామని కన్నా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. నిధులు లేకుండా చేసింది. మా కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు నిధులు విడుదల చేశాం. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నాం. కందులవారిపాలెం, భృగుబండ గ్రామాలకు గతంలో ఎన్నడూ లేనంతగా నిధులు కేటాయించాం. రాబోయే రోజుల్లో ఈ రెండు గ్రామాలను మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం" అని హామీ ఇచ్చారు. "జగన్ 5 ఏళ్ల పాలనలో గ్రామాలను నాశనం చేశాడు. పంచాయతీ నిధులను దారి మళ్లించి వాలంటీర్ వ్యవస్థ పేరుతో గ్రామాల్లో అరాచకం సృష్టించాడు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేశాడు. యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి గంజాయి, డ్రగ్స్‌కి బానిసలను చేశాడు. అమరావతిని చంపేసి 3 రాజధానుల నాటకంతో రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశాడు. సత్తెనపల్లి నియోజకవర్గానికి ఒక్క నిధి కూడా ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డాడు. అలాంటి అరాచక పాలనకు ప్రజలు 2024లోనే బుద్ధి చెప్పారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కూడా వైసీపీకి ఓటు వేస్తే మళ్ళీ అదే అన్యాయం జరుగుతుందని ప్రజలే చెబుతున్నారు" అని కన్నా అన్నారు.

నేపాల్ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని రష్యా సైన్యంలో చేర్చాడు... ఏపీ యువకుల ఆవేదన



అమరావతి (చైతన్యరథం): ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన విశాఖకు చెందిన ఐదుగురు యువకులు ఉక్రెయిన్–రష్యా యుద్ధ పరిణామాల మధ్య చిక్కుకుపోయారు. తమను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని బాధిత యువకులు, వారి కుటుంబసభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. రెండు నెలల క్రితమే విశాఖకు చెందిన ముగ్గురు యువకులను రష్యా–ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రానికి పంపినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి వారి పరిస్థితి, ఆచూకీపై స్పష్టత లేకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ పిల్లలు ఎక్కడ ఉన్నారో ఎలా ఉన్నారో తెలియక కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు మిగిలిన ఇద్దరు యువకులను కూడా మరో రెండు రోజుల్లో యుద్ధ క్షేత్రానికి పంపే ప్రమాదం ఉందని సమాచారం. ఈ నేపథ్యంలో బాధితులు వీడియో సందేశాల ద్వారా తమను రక్షించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పందించిన మంత్రి లోకేశ్: విదేశాల్లో చిక్కుకుపోయి స్వదేశానికి తిరిగి రాలేక ఇబ్బందులు పడుతున్న భారతీయుల పరిస్థితిపై మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను సురక్షితంగా, వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని తన కార్యాలయాన్ని ఆదేశించారు. విదేశాల్లో చిక్కుకున్న పౌరుల దీనస్థితి హృదయవిదారకంగా ఉందని లోకేశ్ వెల్లడించారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, సురక్షితంగా స్వదేశానికి చేరుకునేలా అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

స్థానిక ఎన్నికల ప్రచారంలో పతాక స్థాయికి చేరిన కూటమి హోరు

● **గుడ్లవల్లేరు మండలంలో ఎమ్మెల్యే రాము నేతృత్వంలో రోడ్ షో, బైక్ ర్యాలీ**



గన్నవరం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకున్న వేళ గుడ్లవల్లేరు మండలంలో కూటమి ప్రచారం పతాక స్థాయికి చేరింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నేతృత్వంలో కూటమి శ్రేణులు మండల వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ ప్రచారంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కొనకళ్ల బుల్లయ్య, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన జడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకృష్ణ, కూటమి ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొని మండలంలో భారీ రోడ్ షో నిర్వహించారు. అంగులూరు గ్రామంలో ప్రారంభమైన ఈ రోడ్‌షో గుడ్లవల్లేరు, కౌతవరం, వేమవరం, వడ్లమన్నాడు గ్రామాల మీదుగా రెడ్డిపాలెం వరకు సాగింది. మండలంలోని కీలక గ్రామాలన్నింటినీ కలుపుతూ సాగిన ఈ రోడ్ షోలో కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోడ్ షోలో భాగంగా కూటమి శ్రేణులు, యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారానికి మరింత జోష్ తీసుకొచ్చారు. అనంతరం మండలంలోని రెడ్డిపాలెం, వడ్లమన్నాడు, కొండి పర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే రాము, రావి, కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. వేమవరం గ్రామంలో ఎమ్మెల్యే రాము, రాష్ట్ర నాయకులు బుల్లయ్య ద్విచక్ర వాహనంపై పర్యటిస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రజల కోసం పనిచేసే కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వడ్లమన్నాడు గ్రామంలో జరిగిన ప్రచారంలో కృష్ణా జిల్లా టీడీపీ ఎన్నికల అబ్జర్వర్ బొమ్మలపాటి శ్రీధర్ కూడా భాగస్వామ్యం అయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే రాము, కూటమి నేతలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వివిధ గ్రామాల ప్రధాన కూడళ్లలో మహిళలు హారతులు పట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. వి

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... గత రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి అభివృద్ధి పనిలో కూటమి ప్రభుత్వ ముద్ర స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. గ్రామాల మరింత ప్రగతి, మౌలిక సదుపాయాల కల్పన కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చెప్పిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నామన్నారు. పనిచేసే వ్యక్తులనే, కూటమి అభ్యర్థులుగా ఎంపిక చేసామన్నారు. రానున్న గుడివాడ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజల తోడుగా ఉంటూ పని చేసే వ్యక్తులను అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజలను పట్టించుకోకుండా, కనీసం తాగునీరు కూడా అందించలేని గత వైసీపీ పాలకులు ఇప్పుడు ఎన్నికల సమయంలో మాయమాటలతో ఓట్లు అడగడానికి వస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడే ప్రజలకు దూరంగా ఉన్నవారు ఇప్పుడు ప్రజలకు ఎలా తోడుగా ఉంటారని ప్రశ్నించారు. వారి మాయమాటలు నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి : దేవినేని ఉమా



గొల్లపూడి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. గొల్లపూడి ఎంపీటీసీ అభ్యర్థి లక్ష్మీనారాయణకు సైకిల్ గుర్తుపై, విజయవాడ రూరల్ జడ్పీటీసీ అభ్యర్థి నూతలపాటి బాల కోటేశ్వరరావుకు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజలు అభివృద్ధిని, సుపరిపాలనను బలపరుస్తూ సైకిల్, కమలం గుర్తులపై తమ అమూల్యమైన ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

తుపాను వేళ అధికారులను అప్రమత్తం చేశాం

గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను 'మురసు' తీవ్ర తుపానుగా బలపడింది. ఈ తుపాను ప్రభావం గుంటూరు జిల్లాపై పడనుందని కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "మురసు తుపాను కావలి– ఒంగోలు మధ్య తీరం దాటే అవకాశం ఉంది. అందుకే అధికారులను అప్రమత్తం చేశాం. పులిచింతల నుంచి వరద వస్తే బ్యారేజీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తాం. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఇటు వాన జోరు.. ఆటు కోటంరెడ్డి ప్రచార హోరు!

నెల్లూరు జిల్లా కేంద్రంలో తుఫాను హెచ్చరికలతో జోరు వాన కురుస్తున్నా లెక్క చేయకుండా సౌత్ మోపూరు ఎన్నికల ప్రచారంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితోపాటు ఆమె చిన్న కుమార్తె కోటంరెడ్డి సాయి వైష్ణవి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది



యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక ఎన్నికల సందర్భంగా టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ముడావత్ శాంత బాయిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల టీడీపీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో అప్రమత్తంగా, సంయమనంతో వ్యవహరించాలి

కూటమి శ్రేణులకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచన



ఒంగోలు (చైతన్యరథం): నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈరోజు ఉదయం ఒంగోలు నగరపాలక సంస్థ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి కూటమి కార్పొరేటర్ అభ్యర్థులతో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, వారి ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌంటింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాల్సిన అంశాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన విధానాలపై ఎమ్మెల్యే అభ్యర్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ, కౌంటింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తతతో, సహనంతో, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ఫలితాల విషయంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలకు తావివ్వకుండా, అధికారుల సూచనలు, ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ప్రతి డివిజన్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపును అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు నిశితంగా గమనించాలని, ఓట్ల లెక్కింపులో ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు తలెత్తితే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఓటింగ్‌కు సంబంధించిన వివరాలు పోలింగ్ ఏజెంట్ల వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తూ, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా గమనించాలని కోరారు.కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, కూటమి అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే జనార్దన్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం ఉంచుతూ, తుది ఫలితాలు వెలువడే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కంది రవి శంకర్, కూటమి మేయర్ అభ్యర్థి నల్లమల్లి శ్రీశిల్ప, బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ కన్వీనర్లు, కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

దొనకొండలో హోరెత్తిన చెప్పాం.. చేస్తున్నాం!

పాల్గొన్న టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): దొనకొండ మండలం, పోలేపల్లి గ్రామంలో దొనకొండ మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి మోడీ ఈశ్వరమ్మ గెలుపు కోసం “ చెప్పాం.. చేస్తున్నాం “ కార్యక్రమంలో దర్శి టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్నగారు టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ కూడా ఆమె వెంట ఉన్నారు. ఈ సందర్భంగా దొనకొండ మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి మోడీ ఈశ్వరమ్మకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థిని గెలిపించండి

గిద్దలూరు (చైతన్యరథం): రాచర్ల మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి భూపని చిన్న కాశయ్యకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గారు మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి భూపని కాసయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాచర్ల మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీకి ఓటడిగే హక్కు లేదు

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ ధ్వజం



సర్వేపల్లి (చైతన్యరథం):: ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు వైకాపాకు లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ పేర్కొన్నారు. పొదలకూరు మండలం ప్రగతి నగర్, విరువూరు గ్రామంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, పగడాల రాజేశ్వరమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి చేశామని, ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తాందన్నారు. అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఏమి చేశారో చెప్పుకోలేని వైకాపా నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదని సోమిరెడ్డి విమర్శించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారే తప్ప... అభివృద్ధి శూన్యం అని దుయ్యబట్టారు. అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలు ఆలోచించి గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి మద్దతు తెలపాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి కోరారు. తెదేపా మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, నాయకులు పార్లపల్లి సురేష్ రెడ్డి, ఎద్దల అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..





చేసిన సంక్షేమాభివృద్ధిని చూసి ఓటేయండి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ పార్థసారథి



రాప్తాడు (చైతన్యరథం): రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను చూసి ఓటువేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది. కనగానపల్లి మండలంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి పాల్గొన్నారు. కోనాపురం, కనగానపల్లి గ్రామాలతో పాటు చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల, న్యామద్దల, వెంకటంపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా భారీ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి మండలం సుబ్బరాయునిపల్లి నుంచి ముష్టికోవెల గ్రామం వరకు రోడ్డుపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కనగానపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థి సాకే పోతలయ్య, కోనాపురం ఎంపీటీసీ అభ్యర్థి కురుబ శివలింగ, కనగానపల్లి ఎంపీటీసీ అభ్యర్థి బోయ దాసరి పార్వతి, చెన్నేకొత్తపల్లి జడ్పీటీసి అభ్యర్థి శివలక్ష్మి, ముష్టికోవెల ఎంపీటీసీ అభ్యర్థి నాగలక్ష్మమ్మ, న్యామద్దల ఎంపీటీసీ-1 అభ్యర్థి రాములమ్మ, న్యామద్దల ఎంపీటీసీ-2 అభ్యర్థి పెద్దన్న, చెన్నేకొత్తపల్లి ఎంపీటీసీ-1 అభ్యర్థి మాడెం సూర్యనారాయణ రెడ్డి, వెంకటంపల్లి ఎంపీటీసీ అభ్యర్థి వై.అరుణతో పాటు పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ తాను గతంలో మంత్రిగా ఉన్నప్పటి కంటే ఇప్పుడే ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఎక్కువ అభివృద్ధి పనులు చేస్తున్నానన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో పెద్ద ఎత్తున చెరువులకు నీరు ఇచ్చామన్నారు. పేరూరు ప్రాజెక్టుకు భూమి ఇచ్చిన రైతులకు పూర్తి పరిహారం అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో తెగిపోయిన రెడ్డివారికుంట చెరువును రూ. 90 లక్షలతో పునర్నిర్మించామని.. కోనాపురం గ్రామంలో రూ.1కోటి 10లక్షలతో సీసీ రోడ్లు వేయడంతో పాటు, ఏ కాలనీకి ఏ రోడ్డు కావాలన్నా మంజూరు చేసి పూర్తి చేశామన్నారు. ఇలా చేసిన పనుల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ఓట్లు వేయించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. మహిళలకు, దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం కింద రూ. 15వేలు, మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వంలో తొలగించిన పింఛన్లను కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి మళ్లీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగా మరికొన్ని సమస్యలు తన దృష్టికి వచ్చాయని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ముగిసిన వెంటనే వాటన్నింటినీ పరిష్కరిస్తానన్నారు. పరిటాల రవి ఉన్నప్పటి నుండి నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కన పెట్టి కలిసికట్టుగా ఉండి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పరిటాల రవి హయాం తర్వాత ఇప్పటి వరకు కనగానపల్లి జడ్పీటీసీ గెలవ లేదని.. ఈసారి ఆ గెలుపు చూపిస్తామన్నారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం వరకే ప్రచారం ఉంటుందని.. ఎవరూ సమయాన్ని వృథా చేయవద్దన్నారు. ఇదే వేదికపై రాప్తాడులో జరిగిన బాలికపై ఉన్మాది ఘటన గురించి పరిటాల సునీత ప్రస్తావిస్తూ, ఆ దారుణంపై మంత్రి లోకేష్ చలించిపోయారన్నారు. ఆ బాలిక దేవుని దయ వలన త్వరగా కోలుకుని తిరిగి రావాలని నియోజకవర్గ ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. మరోవైపు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ 'సూపర్ సిక్స్' పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారుల నిర్మాణానికి నిధులు ఇచ్చామన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తూ సరికొత్త పరిశ్రమలను తీసుకువస్తున్నామని వివరించారు. ఈ పరిశ్రమల ద్వారా నియోజకవర్గంలోని యువతకు స్థానికంగానే వందలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలన్నా, కేంద్ర, రాష్ట్ర నిధులు నేరుగా పల్లెలకు చేరాలన్నా ఓటర్లంతా కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని కూటమి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైసీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యం, అభివృద్ధికి పట్టం కట్టండి : పరిగి రోడ్‌షోలో మంత్రి సవిత పిలుపు



పరిగి (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూడా గత ప్రభుత్వం విఫలమైందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.పరిగి మండలంలోని మోదా పంచాయతీ, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండల కేంద్రం శిరేకోళం, ధనాపురం, నరసాపురం పైడేటి తదితర గ్రామాల్లో మంత్రి సవిత ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంత్రికి అడుగడుగునా ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి శాసనకోట వెంకటేష్‌తో పాటు ఎంపీటీసీ అభ్యర్థులు హొన్నంపల్లి నుంచి రాజగోపాల్, కోడిగినహళ్లి-1 నుంచి ఆనందకుమార్, కోడిగినహళ్లి-2 నుంచి చంద్రశేఖర్ (బీజేపీ), కోడిగినహళ్లి-3 నుంచి ఎం. ఆదినారాయణ, మోదా-1 నుంచి గీత కె., మోదా-2 నుంచి అన్నపూర్ణ, మోదా-3 నుంచి శాంతమ్మ, నరసాపురం నుంచి తిరుమలేష్, పరిగి-1 నుంచి పి. శ్రీనివాసులు, పరిగి-2 నుంచి సురేష్ (జనసేన), శ్రీరంగరాజుపల్లి-1 నుంచి శోభ ,శ్రీరంగరాజుపల్లి 2 నంజమ్మ ను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి ప్రజలను అభ్యర్థించారు. రోడ్‌షోలో మంత్రి సవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. వెనుకబడిన పరిగి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సమస్యలు పరిష్కారం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిగి మండల వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 80 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. మారుమూల గ్రామాల్లో సైతం సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను కూడా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన అనంతరం వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో కనీసం మట్టెడు కూడా వేయలేదని, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలవగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని మంత్రి సవిత అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులందరినీ అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుటుంబ నాయకులు కూటమి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.

పెనుకొండ (చైతన్యరథం): పరిగి మండల కేంద్రంలో పలు గార్మెంట్ పరిశ్రమలను మంత్రి సవిత సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను కలిసి వారి యోగక్షేమాలు, పని పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మహిళల జీవితాల్లో మరింత వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి మద్దతు తెలపాలని మహిళా ఉద్యోగులకు మంత్రి సవితమ్మ విజ్ఞప్తి చేశారు.





ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బలో ఎంపీటీసీ, జడ్పీటీ సీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, కూటమి నాయకులు తదితరులు

పులివెందుల గడ్డపై పరిమళించిన ప్రజాస్వామ్యం

రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రకటన

రాయదుర్గం (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డి వంటి దురహంకారి, నియంతృత్వ ధోరణి కలిగిన నాయకుడిని ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలోనే ప్రజాస్వామ్య శక్తి రోడ్డుపై కూర్చోబెట్టిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ముందు కుట్రలు, కుతంత్రాలు, అహంకారం, అరాచక రాజకీయాలు ఎక్కువ కాలం నిలబడలేవని పులివెందుల ఎన్నికలు మరోసారి నిరూపించాయని స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా చెదురు ముదురు సంఘటనలు మినహా కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా ముగిశాయన్నారు. జగన్ నియంతృత్వానికి, ప్రజాస్వామ్య విలువలకు మధ్య పులివెందులలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయన్నారు. రెండేళ్ల క్రితం జగన్ పార్టీని 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన విపరీత మనస్తత్వంలో ఏ మాత్రం మార్పు రాలేదన్నారు. కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాల దారి మరవలేదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో జగన్ పార్టీని చిత్తుగా ఓడించడానికి ఓటర్లు కంకణ బద్ధులై ఓట్లు వేశారన్నారు. 70 శాతం మంది ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారంటే.. అదే ప్రజాస్వామ్యానికి ఉన్న విలువన్నారు. ముఖ్యంగా పులివెందుల చరిత్రలో సామాన్యుడు తొలిసారి స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోగలిగారన్నారు. పులివెందులలో వైసిపి అభ్యర్థులు నిస్సహాయ స్థితిలో ఉన్నారని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, వారికి ప్రజాదరణలేదని స్పష్టమవుతుందన్నారు. పులివెందులలో స్థానికులు కాకుండా ఇంకెవరు వచ్చి ఓటు వేస్తానన్నారని ప్రశ్నించారు. జగన్ని నమ్మి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కనీసం అసెంబ్లీకి కూడా రాకుండా ఎమ్మెల్యేగా ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. మాజీ సీఎం తన సొంత నియోజకవర్గంలోనే రోడ్డుమీద కూర్చోవాల్సి వచ్చిందంటే అదే ప్రజాస్వామ్య గొప్పతనమని నిరూపితమైందన్నారు. దురహంకారం, నియంతృత్వం జగన్మోహన్ రెడ్డి రూపంలో తలదించుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలాకులు గుర్రప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, వైస్ చైర్మన్ మిద్దింటి ధానవేంద్ర, ఉస్మాన్ , యువత రమేష్ తదితరులు పాల్గొన్నారు.





మెల్‌బోర్న్‌లో తెలుగు ప్రవాస దినోత్సవం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ నగరంలో ఏపీఎన్ఆర్టీ ఆధ్వర్యంలో ప్రవాస తెలుగు మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఏపీఎన్ ఆర్టీ రీజినల్, కంట్రీ కో-ఆర్డినేటర్ల నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలు ఆద్యంతం ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, తెలుగు భాషా వైభవాన్ని చాటిచెప్పాయి. స్థానిక తెలుగు వారికి, ప్రవాస ఆంధ్రులకు ఏపీ ప్రభుత్వం తరపున ఏపీఎన్ఆర్టీ అందిస్తున్న సేవలు, సంక్షేమ కార్యక్రమాలను ఈ వేదిక ద్వారా వివరించారు. ప్రవాస ఆంధ్రులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న విశేష సేవలను స్థానిక ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రీజినల్ కో-ఆర్డినేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి శ్రీనివాస్ పల్లపోతు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ఏపీఎన్ఆర్టీ రీజినల్, కంట్రీ సమన్వయకర్తలు కూడా హాజరై నూతనంగా నియమితులైన మెల్‌బోర్న్ ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భారత కాన్సులేట్ నుంచి హేమంత్ పాండే ప్రత్యేకంగా



❑ ఆకట్టుకున్న ఏపీఎన్ఆర్టీ వేడుకలు

విచ్చేసి, ఏపీఎన్ఆర్టీ కో-ఆర్డినేటర్లకు అభినందన పత్రాలను అందజేశారు. సిడ్నీ నుంచి వచ్చిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి శ్రీనివాస్ పల్లపోతు, రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకటేష్ ఎనికపాటి తదితరులు అతిథులకు జ్ఞాపికలను బహూకరించడంతో పాటు, ఈ కార్యక్రమానికి సహకరించిన స్పాన్సర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎన్ఆర్టీ సభ్యత్వాలను మరింతగా పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్ఐలకు అందిస్తున్న సేవలు, సహకారాలను స్థానిక తెలుగువారందరికీ మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో ప్రవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు వారి ఐక్యతను, ఏపీఎన్ఆర్టీ బలాన్ని చాటుతూ అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంపై స్థానిక తెలుగు సంఘాలు, ప్రవాసులు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.






రష్యా సైన్యంలోకి బలవంతంగా

విశాఖ యువకులు

కాపాడాలంటూ తల్లికి వంశీ వీడియో మెసేజ్

సీఎం, డిప్యూటీ సీఎంల జోక్యానికి విజ్ఞప్తి



విశాఖపట్నం (చైతన్యరథం): ఉపాధి కోసం రష్యా వెళ్లిన విశాఖపట్నానికి చెందిన యువకులు అక్కడ తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. తమను బలవంతంగా రష్యా సైన్యంలో చేర్చుకుని ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలోకి పంపుతున్నారంటూ వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... విశాఖకు చెందిన వంశీ సహా ఐదుగురు యువకులు ఏజెంట్ గంగరాజు ద్వారా రష్యా వెళ్లారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత అనుకున్న ప్రకారం ఉపాధి దొరక్కపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఒక నేపాల్ వ్యక్తి ఇచ్చిన సూచనతో రష్యా ఆర్మీలో చేరారు. అందులో ముగ్గురిని రెండు నెలల క్రితం యుద్ధంలోకి పంపగా ఇప్పటివరకూ ఆచూకీ లేదు. ఇక ఇద్దరు మాత్రమే మిగిలామని వంశీ తన తల్లికి పంపిన వీడియో మెసేజ్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. "ఇదే నా చివరి వీడియో కావచ్చు... ఎలాగైనా నన్ను కాపాడండి" అంటూ వంశీ పంపిన సందేశం విన్న ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ కుమారుడి ఆచూకీ కనుగొని సురక్షితంగా స్వదేశానికి రప్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తక్షణం జోక్యం చేసుకోవాలని వంశీ తల్లి కన్నీరుమున్నీరవుతూ విజ్ఞప్తి చేశారు. కాగా విశాఖకు చెందిన ఇద్దరు యువకులు రష్యాలో చిక్కుకుపోయిన ఘటన తనను తీవ్ర మనస్థాపానికి గురి చేసిందని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. '@OfficeofNLకి నా విన్నపం... వారిని ఆదుకోవడానికి, వారు సురక్షితంగా, త్వరగా స్వదేశానికి తిరిగి వచ్చేలా చూడ్డానికి సంబంధిత అధికారులు అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

హంటర్ విల్లెలో కార్తిక మాస వేడుకలు

అమెరికా: హంటర్ విల్లె సాయి గురుదేవ్ దత్త మందిరంలో కార్తిక మాస వేడుక లను నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకూ కార్తిక మాస వేడుకలు జరుగుతాయి. నవంబరు 4, 11, 18, 25 తేదీలలో (సోమవారాలు) సాయంత్రం 7:00 నుంచి 8:00 గంటల వరకు రుద్రాభిషేకం నిర్వహించబడుతుంది. దీనికి ముందుగా సాయంత్రం 6:30 గంటలకు ధూప్ హారతి, రాత్రి 8:00 గంటలకు షేజ్ హారతి ఉంటుంది. నవంబరు 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 5:00 గంటలకు ధూప్ హారతి, 5:30 గంటలకు కార్తిక దీపోత్సవం ($21), 6:30 గంటలకు విశేష సత్యనారాయణ స్వామి వ్రతం ($101), రాత్రి 8:30 గంటలకు షేజ్ హారతితో పాటు మహాప్రసాదం ఉంటుంది. నవంబరు 16న శనివారం మధ్యాహ్నం 12:00 నుంచి 3:00 గంటల వరకు కార్తిక వనభోజనాలు, నవంబరు 28 న మధ్యాహ్నం 3:30 గంటలకు మహానాయాసం, సాయంత్రం 5:00 గంటలకు ధూప్ హారతి, 5:30 గంటలకు రుద్రాభిషేకం, రాత్రి 8:30 గంటలకు షేజ్ హారతి ఉంటాయి. భక్తులు వివిధ పూజల నిమిత్తం ఆర్థిక సాయం కూడా అందించవచ్చని నిర్వాహకులు ప్రకటించారు. నాలుగు సోమవారాల యజమాన పూజ స్పాన్సర్‌షిప్ $116 కాగా, ఒక్కరోజు రుద్రాభిషేకం స్పాన్సర్‌షిప్ $31, మరియు మహాప్రసాదం స్పాన్సర్‌షిప్ $151గా నిర్ణయించారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్



www.saiclt.orgను సందర్శించవచ్చు లేదా ఫోన్ నంబర్ 7047270711 ద్వారా సంప్రదించవచ్చు. విరాళాలు అందించడానికి మరియు చెల్లింపుల కోసం Zelle PayTo Sai@saiclt.org లేదా Donate tosai @saiclt.orgని ఉపయోగించవచ్చు.

తెలుగు అసోసియేషన్ చార్లెట్ ఆధ్వర్యంలో

ఆరోగ్య శిబిరం విజయవంతం

అమెరికా: తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చార్లెట్ ఏరియా (టీఏజీసీఏ) ఆధ్వర్యంలో హెల్త్ ఫెయిర్ 2026 ఘనంగా ముగిసింది. అక్టోబరు 18, 31వ తేదీల్లో ఈ ఆరోగ్య శిబిరం జరిగింది. అక్టోబర్ 18న పైన్‌విల్లే డెంటల్ స్టూడియోలో రక్తదాన దినోత్సవం జరిగింది. శ్రీలత చలసాని నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఇక అక్టోబరు 31న జరిగిన ఆరోగ్య శిబిరం సాయి గురుదేవ్ దత్తమందిర్‌లో జరిగింది. ఈ వైద్యశిబిరంలో వైద్యులు శ్రీలత చలసాని, నిశ్చల్ నేత, శ్రీనివాస్ కోయ, శోభ జయరాం, కృష్ణ జొన్నల గడ్డ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకూ ఈ వైద్య శిబిరం కొనసాగింది. ఈ ఆరోగ్య శిబిరం గ్రాండ్ సక్సెస్ అయ్యిందని తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చార్లట్ ఏరియా ప్రకటించింది. సమాజానికి సేవ చేయాలన్న తమ తపనను ఆచరణలోకి తెచ్చి సేవలందించిన వైద్య సిబ్బందికి ధన్యవాదాలు ప్రకటించారు. అలాగే ఎప్పటికప్పుడు సేవలందించి ఆరోగ్య సేవలు సజావుగా సాగేందుకు సహకరించిన వాలంటీర్లకు కూడా నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. రక్తదాన దినోత్సవం, ఆరోగ్య సంప్రదింపుల శిబిరాన్ని విజయవంతం చేసిన పాల్గొన్న వారికి, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.





అరాచకాలతో అందలమెక్కాలని కాంగ్రెస్ కంకణం



ధ్వజమెత్తిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఎన్నికల్లో వరుస ఓటములతో కాంగ్రెస్ కుదేలైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసైనా సరే అధికారంలోకి రావాలని ఆ పార్టీ కంకణం కట్టుకుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కుటిల ప్రయత్నాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే బీజేపీ మహా పాదయాత్ర చేస్తోందని చెప్పారు. ఈ మేరకు అమిత్ షా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా సోమవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీజేపీ 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం, అరాచకవాదాన్ని అంతం చేద్దాం' పేరిట మహా పాదయాత్ర నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో పాల్గొనేందుకు కేంద్ర హోంమంత్రి నగరానికి వచ్చారు.



వివాదంలో జమ్మూకశ్మీర్ సీఎం వివాహం

ఇస్లామిక్ సూత్రాల ప్రకారం చట్టవిరుద్ధమని మత గురువు అభ్యంతరం

జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ప్రముఖ జర్నలిస్ట్ నిధి రజ్దాన్‌తో పెళ్లి జరిగిన మూడు రోజులకే ఓ మతపరమైన వివాదం రాజుకుంది. వీరి వివాహం ఇస్లామిక్ సూత్రాల ప్రకారం చట్టవిరుద్ధమని మత గురువు, ఆల్ ఇండియా ముస్లిం జమాత్ (ఏఐఎమ్‌జే) జాతీయ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహాబుద్దీన్ రజ్వీ బరేల్వీ ప్రకటించారు. షరియా చట్టం ప్రకారం ముస్లిం వివాహాల్లో వధూవరులిద్దరూ ఇస్లాం మతస్థులై ఉండాలని ఆయన తెలిపారు. అబ్దుల్లా ముస్లిం అయినప్పటికీ నిధి రజ్దాన్ అన్యమతస్థురాలని చెప్పారు. కాబట్టి షరియా చట్టం ప్రకారం ఈ వివాహం చెల్లదని పేర్కొన్నారు. పెళ్లికి ముందే నిధి రజ్దాన్ ఇస్లాం మతంలోకి వచ్చి ఉండాల్సిందని ఏఐఎమ్‌జే అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. అప్పుడు వీరి వివాహం చెల్లుబాటు అయ్యేదని అన్నారు. కాగా శుక్రవారం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు జర్నలిస్ట్ నిధి రజ్దాన్‌తో పెళ్లి జరిగింది. ఇది 'జమ్మూ' సీఎంకు రెండో వివాహం. తొలి భార్యతో ఆయనకు విడాకులు మంజూరు చేయడానికి కోర్టు ఇటీవలే అంగీకరించింది. దీంతో ఒమర్ అబ్దుల్లా రెండోసారి వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మతపరమైప వివాదం ఏర్పడింది.

ఢిల్లీలో కఠినంగా కాలుష్య నియంత్రణ చర్యలు



ఒక్క రోజులో రూ.68.4 లక్షల జరిమానా

ఢిల్లీలో కాలుష్య నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వాహనాల యజమానులకు భారీగా జరిమానాలు విధించారు. వింటర్ యాక్షన్ ప్లాన్ అమల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం రూ.68.4 లక్షల జరిమానా వేశారు. ఆరోజు దాదాపు 15 వేల వాహనాలను తనిఖీ చేశారు. 1539 వాహనాలను బార్డర్ పాయింట్లతో తిప్పి పంపారు. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పీయూసీసీ) ఉల్లంఘనల కింద 566 చలానాలు జారీ చేశారు. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వం ఒక నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం.. పీయూసీసీ ఉల్లంఘనలకు రూ.56.6 లక్షలు, సరిహద్దుల వద్ద ఆంక్షల ఉల్లంఘనలకు రూ.2 లక్షలు, నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినందుకు రూ.9.8 లక్షల మేర జరిమానా వేశారు. ఆదివారం 14,930 వాహనాలను ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. వాటిలో 1400 వెహికల్స్‌ను వెనక్కి పంపారు. 62 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వెనక్కి పంపిన వాహనాల్లో 140 తేలికపాటివి కాగా, 54 లైట్ కమర్షియల్ వెహికల్స్, 95 హెవీ గూడ్స్ వెహికల్స్, 34 బస్సులు ఉన్నాయి. అలాగే 1423 టూ వీలర్లు, త్రీ వీలర్లను చెక్ చేసి 789 వాహనాలను వెనక్కి పంపారు. వాటిలో 38 వెహికల్స్ సీజ్ చేశారు. కాగా.. కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్, ఎలక్ట్రిక్ వాహనాలు, అత్యవసర సర్వీసుల కోసం ఉపయోగించే వాహనాలకు ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాంటివి మొత్తం 740 వెహికల్స్‌ను తనిఖీ చేసి అనుమతించారు. అలాగే పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ లేకుండా వెహికల్స్ నడుపుతున్న యజమానులకు అధికారులు 566 చలానాలు జారీ చేశారు. రూ.56.6 లక్షల జరిమానా కూడా విధించారు. వాటిలో ఢిల్లీ పోలీసులు వేసిన చలాన్లు 493, జరిమానాలు రూ.49.3 లక్షలు ఉండగా, రవాణా శాఖ అధికారులు వేసిన చలాన్లు 73, జరిమానాలు రూ. 7.3 లక్షలు ఉన్నాయి. ఇక నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన యజమానులకు పర్యావరణ పరిహారం కింద రూ.9.8 లక్షల ఫైన్ వేశారు. వింటర్ యాక్షన్ ప్లాన్ ఆంక్షలు ఈనెల 1 నుంచి వచ్చే ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటాయి. ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు వింటర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు.

భారత నౌకాదళానికి 8 అత్యాధునిక యుద్ధనౌకలు



రూ.53,866 కోట్లతో ఒప్పందం

భారత నౌకా దళాన్ని పటిష్ఠం చేసే విధంగా కొత్తతరం యుద్ధ నౌకల తయారీకి రక్షణ మంత్రిత్వ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా జీఆర్ఎస్ఈకి 5 కార్వెట్‌లు, గోవా షిప్‌యార్డ్‌కు 3 యుద్ధనౌకల నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు రక్షణశాఖ తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా షిప్‌యార్డుల్లో 72 లక్షలు, ఎంఎస్ఎంఈలలో 4.6 కోట్ల మేరకు ఉపాధి లభిస్తుందని రక్షణ శాఖ పేర్కొంది. ఈ 8 కార్వెట్లను ఆకాశం, సముద్ర ఉపరితలం, నీటి అడుగున ఒకేసారి దాడి చేసే విధంగా అత్యాధునిక టెక్నాలజీతో రూపుదించనున్నట్లు వెల్లడించింది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా స్వదేశీ డిజైన్, టెక్నాలజీతో యుద్ధనౌకల నిర్మాణం చేపట్టనున్నట్లు రక్షణ శాఖ పేర్కొంది.

బాంబే హైకోర్టుకు నటుడు ఇమ్రాన్ ఖాన్ బేషరతు క్షమాపణ




సీఈసీ వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్నందుకు మందలించిన న్యాయమూర్తులు

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) లో అవకతవకలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించిన ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్.. బాంబే హైకోర్టుకు బేషరతు క్షమాపణ చెప్పారు. భవిష్యత్తులో అలాంటి ఆందోళనల్లో పాల్గొనబోనని ఆయన హామీ ఇచ్చారు. గత నెల 10న ముంబైలో నిర్వహించిన సర్ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్న ఇమ్రాన్‌కు ఇండియా వదిలివెళ్లాలని పోలీసులు నోటీసులను జారీ చేశారు. ఆ నోటీసులను ఆయన బాంబే హైకోర్టులో సవాలు చేశారు. ఆయన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారణకు స్వీకరించింది. సర్ వ్యతిరేక ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు కోర్టు ఆయనను మందలించింది. 'మీరు (ఇమ్రాన్ ఖాన్) అమెరికన్ సిటిజన్. మీ దగ్గర ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉంది. ఈ నేపథ్యంలో ఒక భారతీయ పౌరుడిగా రాజకీయ ప్రదర్శనల్లో మీరు పాల్గొనలేరు. ఆ హక్కు మీకు లేదు. భారతీయ పౌరుడు అమెరికాలో అలాంటి నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటే ఏంటి పరిస్థితి. మరుసటి రోజే ఆ పౌరుడిని ఇండియాకు తరలిస్తారు' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.ఇమ్రాన్ ఖాన్ ఆయన మొత్తం జీవితాన్ని భారత్‌లోనే గడిపారని, ఆయనకు అమెరికన్ పౌరసత్వం పుట్టుకతోనే వచ్చిందని ఆయన అడ్వొకేట్ వెంకటేశ్ ధోండ్ తెలిపారు. అయినా కూడా ఇమ్రాన్ అలాంటి ఆందోళనలో పాల్గొనలేరని హైకోర్టు స్పష్టం చేసింది. ఇమ్రాన్ తన జీవితం మొత్తం భారత్‌లోనే గడిపేస్తే, భారత పౌరసత్వం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించింది. భారత పౌరసత్వం తీసుకోవాలని సూచించింది. ఎందుకంటే ఆయన మన దేశంలోనే బాలీవుడ్ స్టార్ అయ్యారని గుర్తుచేసింది. క్షమాపణ చెప్పినా హైకోర్టు ఆయనను తీవ్రంగా మందలించింది. భవిష్యత్తులో మళ్లీ అలాంటి రాజకీయ ఆందోళనలో పాల్గొనడానికి ఆ క్షమాపణను సాకుగా వాడుకోరాదని హైకోర్టు సూచించింది.



అమెరికా హాలోవీన్ వేడుకల్లో హింసాకాండ

పలు చోట్ల సామూహిక కాల్పులు



అమెరికా: హాలోవీన్ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. నైట్‌క్లబ్స్, హాలోవీన్ పార్టీ జరిగిన ప్రదేశాల్లో, హాలోవీన్ దుకా ణాల్లో దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో సామూహిక కాల్పులు చోటుచేసున్నాయి. కాగా.. ఈ దాడులకు ఒకదానితో మరో దానికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అమెరికాలోని డల్లాస్, కాలిఫోర్నియా, ఫ్లోరిడాలోని పలు ప్రాంతాలతో పాటు బర్మింగ్ హామ్, బ్లూమింగ్టన్, ఫేయెట్విల్లే సమీపంలోని పలు యూనివర్శిటీ ప్రాంగణాలలో కాల్పులు చోటు చేసుకున్నాయి. మ్యూజిక్, రెస్టారెంట్లు, నైట్‌లైఫ్‌కు పేరుపొందిన 'డీప్ ఎల్లమ్' ప్రాంతంలో శనివారం జరిగిన వేర్వేరు కాల్పుల్లో నలుగురు మరణించగా.. 15 మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా జరిగిన కాల్పుల్లో.. ఇదే అత్యంత హింసాత్మక ఘటన అని పేర్కొన్నారు. బర్మింగ్‌హామ్‌లోని అలబామాలో శనివారం రాత్రి ఫుట్‌బాల్ గేమ్ నిర్వహించగా.. ఆట పూర్తైన అనంతరం రెండు చోట్ల కాల్పులు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో ఒకరు మరణించగా.. ఎనిమిది మంది గాయపడ్డారని వెల్లడించారు. ఈ ఆటకు దాదాపు 70,000 మంది అభిమానులు హాజరయ్యారని, ఆట ముగిసిన వెంటనే చాలా మంది ఇళ్లకు వెళ్లిపోవడం వల్ల ప్రాణనష్టం తగ్గిందని తెలిపారు. ఆర్కాన్సాస్‌లోని ఫాయెట్‌విల్లే.. అలబామా లోని బర్మింగ్‌హామ్.. డెలావేర్‌లోని నెవార్క్.. ఇల్లినాయిస్‌లోని బ్లూమిం గ్‌టన్ కళాశాలల ప్రాంగణాలలో ఆదివారం తెల్లవారు జామున కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో 19 ఏళ్ల యువతి మరణించగా.. మరో మహిళ పరిస్థితి విషమం గా ఉందని.. గాయపడిన 12 మందిని హాస్పిటల్‌లో చేర్పించిన ట్లు పోలీసులు తెలిపారు. కాగా.. గంట వ్యవధిలోనే ఈ కళాశాల ల్లో కాల్పులు జరిగాయని.. ఈ కాల్పుల్లో ఒకదానితో మరోదానికి సంబంధం ఉండవచ్చని అధికారులు అనుమా నిస్తున్నారు.

గ్రేమాంట్ అవెన్యూ వెంబడి వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలపై కాల్పులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామని.. అతని వద్ద పలు ఆయు ధాలు లభించాయని పేర్కొన్నారు. కాలిఫోర్నియాలోని ఓ దుకాణంలో శుక్రవారం జరిగిన కాల్పుల్లో.. 31 ఏళ్ల గర్భవతి మరణించ గా.. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. కాలిఫోర్నియా, మిచిగాన్ ప్రాంతా ల్లోని హాలోవీన్ దుకాణాలపై శుక్రవారం కాల్పులు జరిగినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోల్లో.. ప్రజ లు సంఘటనా స్థలం నుంచి ప్రాణరక్షణ కోసం పరుగె త్తడం కనిపించిందని.. కాల్పుల ఘటన తర్వాత నగరంలోని మెయిన్ స్ట్రీట్‌ను చాలా గంటలపాటు మూసివేశారని పోలీసులు తెలిపారు. డ్రగ్స్‌కు బానిసలవ్వడం, ఆయుధాలు సులభంగా అందుబాటులో ఉండడం వల్ల చిన్న గొడవలకే కాల్పులకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.. కాగా కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని వెల్లడించారు.

ట్రంప్ నివాసానికి దగ్గర్లో కూలిన విమానం



అమెరికా: ఫ్లోరిడా రాష్ట్రంలో ఉన్న ట్రంప్ నివాసం వద్ద ఘోర విమాన ప్రమాదం జరిగింది. తొమ్మిది మంది ప్రయాణికులతో వెళ్తున్న బిజినెస్ జెట్ అత్యంత వేగంతో క్షిపణి మాదిరిగా నడిరోడ్డుపై కూలిపోయింది. ఆ వెంటనే భారీ అగ్ని గోళంలా పేలిపోయింది. ఆ ప్రమాద తీవ్రతకు విమానంలో ఉన్న వారంతా ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్ ప్రాంతం నుంచి బహమాస్‌కు బయలుదేరింది. ఫ్లోరిడా రాష్ట్రంలోని పామ్ బీచ్ కౌంటీలో రోడ్డుపై ఇది కూలిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిసార్ట్ 'మార్-ఎ-లాగో'కు 14 కి.మీ దూరంలోనే ఈ ఘటన జరగడం సంచలనంగా మారిం ది. అలాగే నివాస ప్రాంతాలు, వాహనాలకు దూరంగా పడటంతో భారీ ప్రాణనష్టం తప్పింది. కానీ, రోడ్డుపై మాత్రం పెద్ద గుంత ఏర్పడింది. కూలిపోవడానికి ముందు విమాన సిబ్బంది నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్కు సందేశం వచ్చింది. విమానం అదుపు తప్పి వేగంగా ఎత్తును కోల్పోతుందని వారు భయాందోళనకు గురయ్యారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. "మాకు సమయం లేదు" అంటూ లోపల సిబ్బంది ఆర్తనాదాలు చేస్తోన్న ఆడియో క్లిప్ బయటకు వచ్చింది. ఈ ఘటనకు ముందే కొద్దిపాటి కుదుపులకు లోనైనట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు పైలట్ సమాచార మిచ్చారు.అయితే అవి నియంత్రించే స్థాయిలో ఉన్నా యని చెప్పారు. ఆ తర్వాత హఠాత్తుగా పరిస్థితి అదుపు తప్పింది. సిబ్బంది మేడే కాల్ పంపారు. "మేడే.. మేడే.. మేం వేగంగా ఎత్తును కోల్పోతున్నాం. ఓవర్ స్పీడ్‌లో ఉన్నాం" అని సిబ్బంది అప్రమత్తం చేశారు. కానీ, అప్పటికే నష్టం జరిగిపోయింది. ఫెడరల్ ఏవియేషన్, అడ్మినిస్ట్రేషన్, నేషనల్ ట్రాన్స్పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాయి. ఈ ఘటన దృశ్యాలు వైరల్‌గా మారాయి.

బిల్‌బోర్డ్స్ హ్యాక్..నీలిచిత్రాల ప్రదర్శన!



ఈజిప్ట్: ఈజిప్ట్, మలేషియా, బ్రెజిల్, చైనా, ఇరాక్ దేశాల్లోని బిల్‌బోర్డ్‌లను గతవారం హ్యాకర్లు హైజాక్ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్లపై ప్రకటనల స్థానంలో అశ్లీల చిత్రాలు దర్శన మిచ్చా యని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈజిప్ట్ రాజధాని కైరోలో అత్యంత రద్దీగా ఉండే రహదారిపై ఉన్న బిల్బోర్డు కనిపించిన దృశ్యాలు వాహనదారులను ఒక్కసారిగా షాక్‌కు గురిచేశాయి. కొందరు ఆ దృశ్యాలను రికార్డు చేసి, సోషల్ మీడియాలో షేర్ చేయ డంతో హ్యాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. బిల్‌బోర్డ్స్‌కు సంబంధించిన కంపెనీ వెబ్‌సైట్‌పై సైబర్ దాడి జరిగిందని, అనధికారిక ఫుటేజీ ఒకే సమయంలో పలు దేశాల్లో ప్రసార మైందని ఈజిప్ట్ ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై దర్యాప్త జరుగుతోందని చెప్పింది. అయితే కంపెనీ పేరు, ఆ దేశాల పేర్లను మాత్రం బయట పెట్ట లేదు. లోపాలున్న వ్యవస్థలను గుర్తించి, డిజిటల్ బిల్ బోర్డుల్లోకి చొరబడేందుకు కొన్ని గంటల సమయం మాత్రమే పట్టిందని టెలిగ్రామ్ లీకెన్స్ పేరిట హ్యాకర్ల బృందంప్రకటించుకుంది. ఎల్ఈడీ స్క్రీన్లకు కంటెంట్ను ప్రసారం చేయడానికి ఉప యోగించే సాఫ్ట్‌వేర్‌ని లోపాలను వాడుకున్నట్లు చెప్పింది. మలేషియా, బ్రెజిల్లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో యాడ్ సంస్థలు వెంటనే బిల్ బోర్డులను స్విచ్ఛాఫ్ చేశాయి. తాము బిల్ బోర్డుల ను లక్ష్యంగా చేసుకున్నది డబ్బు కోసమో, బెదిరిం చడం కోసమో కాదని హ్యాకర్లు చెప్పడం గమ నార్హం. వారు ప్రకటనల కంపెనీల భద్రతా చర్యల ను ఎగతాళి చేశారు. మౌలిక సదుపాయాలపై లక్షల డాలర్లు ఖర్చు చేస్తున్నాయి కానీ.. ఇంటర్నెట్‌లో అనుసంధానించిన స్క్రీన్లను మాత్రం రక్షించుకోలేక పోతున్నాయని ఎద్దేవా చేశారు. తగిన భద్రత లేని స్క్రీన్లను హ్యాక్ చేయగలమని చూపించడమే తమ ఉద్దేశమని, చైనా, ఇరాక్లోని బిల్ బోర్డులను టార్గెట్ చేశామని చెప్పారు.



ఇరాన్‌పై మరో యుద్ధానికి సిద్ధమా?

ట్రంప్, పుతిన్ చర్చలపై అనుమానాలు

అమెరికా: పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా? ఇరాన్‌పై మరోసారి సైనిక దాడులు జరిగే అవకాశం ఉందా? అవుననే అంటోంది అంతర్జాతీయ మీడియా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య తాజాగా జరిగిన ఫోన్ సంభాషణ ఈ అను మానాలకు కారణం. అమెరికా మధ్యంతర ఎన్నికలు నవంబరు 3న జరగనున్న నేపథ్యంలో, ఆ తర్వాత ఇరాన్‌పై మరోసారి దాడులు జరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అక్టోబరు 31న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు 'వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం పేర్కొంది. ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్య చేపట్టడం గురించి అమెరికా అధికారులు చర్చిస్తున్న సమయంలో ఈ సంభాషణ జరిగినట్లు సమాచారం. అయితే ఇద్దరు నేతలు ఏ అంశాలపై మాట్లాడారనే పూర్తి వివరాలు బయటకు రాలేదు. అంతకుముందు వైట్‌హౌస్‌లో ట్రంప్ ఉన్నతస్థాయి సైనిక అధికా రులతో సమావేశమై ఇరాన్‌పై తదుపరి చర్యలకు సంబంధించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అమెరికాలో నవంబరు 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఇరాన్‌పై ట్రంప్ నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చని ఇజ్రాయెల్ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. రిపబ్లికన్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలితే తన రాజకీయ బలాన్ని ప్రదర్శిం చేందుకు ట్రంప్ సైనిక చర్యలకు మొగ్గు చూపవచ్చని ఇజ్రాయెల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ నుంచి కొత్త దాడులు జరిగితే గట్టిగా స్పందిస్తామని ఇరాన్ హెచ్చ రిస్తోంది. తమ సైనిక దళాలను పూర్తి అప్రమత్త స్థితిలో ఉంచినట్లు ఇరాన్ రక్షణ అధికారులు వెల్లడించారు.

స్వీడెన్, బెల్జియం దేశాల్లో సైబర్ దాడి

రిఫ్రిజ్‌రేటర్ల నుంచి వేడి గాలులు



స్వీడెన్: స్వీడెన్, బెల్జియం దేశాల్లో ఇటీవల జరిగిన సైబర్ దాడితో మిలియన్ల డాలర్ల విలువైన ఆహార పదార్థాలు పాడైపో యాయి. సైబర్ దాడితో రిఫ్రిజ్‌రేటర్ల ఉష్ణోగ్రత అదుపు తప్పి, అవి వేడి గాలులు వెదజల్లుతూ ఒవెన్‌లను తలపించాయి. గత నెలలో ఫ్రాన్స్‌లో ఇదే తరహా సైబర్ దాడి వెలుగుచూసింది. ఇంతలోనే మరో రెండు దేశాల్లో ఈ దాడి జరగడంతో కలకలం రేగుతోంది. స్వీడెన్‌లోని ఐకా, కూప్ సూపర్‌మార్కెట్లు ఈసారి సైబర్ నేరగాళ్ల కు టార్గెట్‌గా మారాయి. బెల్జియంలోని అహోల్డ్ డెల్‌హెయిజ్ సూపర్ మార్కెట్ చెయిన్‌ను నేరగాళ్లు టార్గెట్ చేసుకున్నారు. ఈదాడి తరువాత తమ సిబ్బంది రిఫ్రిజ్‌రేటర్ల ఉష్ణోగ్రతను నియం త్రించలేకపోయారని ఓ ఐకా స్టోర్ బాస్ తెలిపారు. 'రిఫ్రిజ్‌రేట ర్లలో ఉష్ణోగ్రతను మార్చలేకపోయాము. లోపలి నుంచి వేడిగాలు లు వచ్చాయి. ఆహారం మొత్తం నాశనమైందని అని అన్నారు. ఫ్రిజ్‌లోపలి ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటడంతో అంతా నాశనమైం దని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్జియంలోని డెల్‌హెయిజ్ సూపర్‌మార్కెట్ చెయిన్‌పైనా ఈ ప్రభావం పడింది. మొత్తం 40 షాపుల్లో ఆహారం చెడిపోయింది. స్పార్ సంస్థకు చెందిన మరో ఐదు షాపులు కూడా దెబ్బతిన్నాయి. డాన్‌ఫోస్ అనే సంస్థకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉన్న రిఫ్రిజ్‌రేటర్లు, ఫ్రిజర్లు సైబర్ దాడి బారిన పడ్డాయి. పాత సాఫ్ట్‌వేర్ ఉన్న ఉపకరణాలనే టార్గెట్‌గా మారా యని అప్పట్లో డాన్‌ఫోస్ చెప్పింది. సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దామని కూడా వెల్లడించింది. తాజా ఘటనపై మాత్రం సంస్థ ఇంకా స్పందించలేదు.

పాక్‌కు షాకిచ్చిన ఐసీసీ!



ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా లాహోర్ వేదికగా శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్ విజయం సాధిం చింది. టైటిల్ గెలిచిన ఆనందంలో ఉన్న షాహీన్ షా అఫ్రిది సేనాకు ఐసీసీ బిగ్ షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయడంలో విఫలమవడంతో జరిమాన పడింది. స్లో ఓవర్-రేట్ నిబంధన కింద పాకిస్థాన్ ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 5 శాతం కోత విధించినట్లు ఐసీసీ వెల్లడించింది. ఐసీసీ ఎలైట్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో పరిశీలనలో పాక్ జట్టు నిర్ణీత సమయానికి ఒక ఓవర్ వెనుక బడినట్లు నిర్ధారణ అయింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. జట్టు నిర్ణీత సమయానికి తక్కువ ఓవర్లు వేస్తే ప్రతీ ఓవర్‌కు 5 శాతం మ్యాచ్ ఫీజు జరిమానాగా విధిస్తారు. తాజాగా పాకిస్థాన్ జట్టుకు జరిమానా విధిస్తూ ఆన్ ఫీల్డ్ అంపైర్లు అహ్సాన్ రజా, వేన్ నైట్స్, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్‌లు నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ కెప్టెన్ షాహీన్ షా ఆఫ్రిది తన తప్పును అంగీకరించి.. శిక్షను స్వీకరించడంతో అధికారిక విచారణ నుంచి మినహాయింపు లభించింది. మరోవైపు మ్యాచ్ విషయానికి వస్తే.. శ్రీలంక నిర్దేశించిన 326 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. అటాకింగ్ బ్యాటింగ్‌తో చెలరేగిన పాక్ జట్టు కేవలం 48.3 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొమ్మిది బంతులు మిగిలి ఉండగానే మూడు వికెట్ల తేడాతో విజయం సాధించి ముక్కోణపు ట్రోఫీని కైవసం చేసుకుంది.

ఈ విజయంతో పాక్ శిబిరంలో సందడి నెలకొంది. ఈ భారీ విజయంలో ఆ జట్టుకు జరిమానా చిన్నపాటి చేదు అనుభవంగా మిగిలిపోయింది. పాకిస్థాన్ వేదికగా ఆతిథ్య జట్టు తో పాటు ఇంగ్లండ్, శ్రీలంక మధ్య ట్రై సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచ కప్‌కు సన్నాహా కాల్లో భాగంగా ఈ సిరీస్‌ను పాకిస్థాన్ నిర్వహించింది.

ఐర్లాండ్‌పై నమీబియా చరిత్రాత్మక విజయం

నమీబియా క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ ఫుల్ మెంబర్ జట్టుపై మొట్టమొదటి సారి వన్డే సిరీస్ గెలిచింది. ఐర్లాండ్‌పై ఐదో వన్డేలో విజయం సాధించి ఈ అరుదైన ఘనత సాధించింది. ఐదు వన్డేల సిరీస్ ఆడేందుకు నమీబియా పర్యటనకు ఐర్లాండ్ వెళ్లింది. ఈ క్రమంలో తొలి వన్డేలో పసికూన నమీబియాను 55 పరుగుల తేడాతో ఓడించిన ఐరిష్ జట్టు.. రెండో వన్డేలో మాత్రం 31 పరుగుల తేడాతో ఓడింది. ఈ క్రమంలో మూడో వన్డేలో నమీబియా 63 పరుగుల తేడాతో గెలవగా నాలుగో వన్డేలో ఐర్లాండ్ ఏకంగా 130 పరుగుల భారీ తేడాతో ఆతిథ్య జట్టును మట్టికరిపించింది. దీంతో సిరీస్ 2-2తో సమం కాగా.. ఆదివారం నాటి నిర్ణయాత్మక మ్యాచ్‌లో నమీబి యా అదరగొట్టింది. దీంతో 3-2 తేడాతో వన్డే సిరీస్ ను నమీబియా కైవసం చేసుకుంది. విండ్‌హాక్ వేదికగా జరిగిన ఐదో వన్డేలో టాస్ గెలిచిన ఐర్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా.. నమీబియా బౌలర్లు దెబ్బకు 33.1 ఓవర్లలో కేవలం 129 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన నమీబియా కేవలం 21.2 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 131 పరుగులు స్కోరు చేసింది. లారెన్ స్టీంకాంప్ 46, కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ 30 పరుగులతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో నమీబియా ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌ను 3-2తో కైవసం చేసుకుంది. తద్వారా టెస్టు హోదా ఉన్న జట్టుపై తొలిసారి ఈ ఘనత సాధించిన జట్టుగా నమీబియా నిలిచింది.



శ్రీలంకను తక్కువగా అంచనా వేయొద్దు: గంభీర్



న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియాకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పలు కీలక సూచనలు చేశాడు. డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత పర్యటనకు రానుంది. డిసెంబరు 13 నుంచి మూడు టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటి నుంచి సిద్ధం కావాలని ప్లేయర్లకు గంభీర్ సూచించాడు. నెల రోజుల విరామం ఉన్నప్పటికీ సమయం వృథా చేసుకోకుండా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని చెప్పాడు. 'న్యూజిలాండ్ పర్యటనలో భారత టీ20 జట్టు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. మీరు తలెత్తుకుని స్వదేశానికి వెళ్లొచ్చు. చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవాలని అనుకున్నాం. కానీ కొన్నిసార్లు ఇలాంటివి జరుగుతుంటాయి. మనం ఎక్కువగా టీ20 క్రికెట్ ఆడటం లేదు. ఇప్పుడు నెల రోజుల విరామం ఉంది. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలి. శ్రీలంక సిరీస్ కోసం బాగా సిద్ధం కావాలి. ఏ ప్రత్యర్థినీ తక్కువ అంచనా వేయకూడదు. జట్టుగా నిరంతరం ఎదుగుతూ ఉండాలి. జట్టుగా ఆలోచించాలి. జట్టుగానే ఆడాలి. విజయాలు అవే వస్తాయని నిర్లక్ష్యంగా వ్యవహరించకండి. ఫిట్‌నెస్‌ను కాపాడుకోండి' అని గంభీర్ స్పష్టం చేశాడు.

ఎఫ్1 రేసింగ్ ప్రపంచ ఛాంపియన్‌గా ఆంటోనెల్లి

అతి పిన్న వయస్కుడిగా రికార్డు



ఫార్ములా వన్ చరిత్రలో సరికొత్త అధ్యాయం నమోదైంది. మెర్సిడెస్ జట్టు యువ డ్రైవర్ కిమీ ఆంటోనెల్లి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. కేవలం 20 ఏళ్ల వయసులోనే ఎఫ్1 ప్రపంచ టైటిల్ గెలుచుకుని.. ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఆదివారం జరిగిన మెక్సికో సిటీ గ్రాండ్ ప్రిక్స్‌లో మూడో స్థానంలో నిలవడంతో ఆంటోనెల్లి ఛాంపియన్‌షిప్ ఖరారైంది. ఈ రేసులో మాక్స్ వెర్‌స్టాపెన్, లూయిస్ హామిల్టన్ తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఇప్పటివరకు ఈ రికార్డు జర్మనీ దిగ్గజ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ పేరిట ఉండేది. 2010లో తన తొలి ప్రపంచ టైటిల్ గెలిచే సమయానికి వెటెల్ వయసు 23 ఏళ్ల 133 రోజులు. ఇప్పుడు 20 ఏళ్ల ఆంటోనెల్లి ఆ రికార్డును అధిగ మించాడు. ఎఫ్1లో తన రెండో సీజన్‌లోనే ఈ ఘనత సాధించడం విశేషం. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలియగానే ఆంటోనెల్లి భావో ద్వేగానికి గురయ్యాడు. టీమ్ రేడియోలో తొలుత ఏం మాట్లా డాలో తెలియక కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. అనంతరం ఆనందంతో 'మనం సాధించాం.. మనం సాధించాం!' అంటూ కేకలు వేశాడు.

73 ఏళ్ల తర్వాత ఇటలీకి ప్రపంచ టైటిల్!

ఆంటోనెల్లి విజయం ఇటలీ మోటార్‌స్పోర్ట్ చరిత్రలోనూ ప్రత్యేకంగా నిలిచింది. 1953లో అల్బెర్టో ఆస్కారి తర్వాత ఫార్ము లా వన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ గెలిచిన తొలి ఇటాలియన్‌గా ఆంటోనెల్లి నిలిచాడు. దీంతో ఇటలీకి 73 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. అంతేకాదు.. 21వ శతాబ్దంలో జన్మించి ఎఫ్1 ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి డ్రైవర్‌గా కూడా రికార్డు సృష్టించాడు.

అభిషేక్ శర్మ రికార్డ్ బ్రేక్ చేసిన ఫిలిప్స్



హామిల్టన్ వేదికగా జరిగిన ఆఖరి టీ20లో భారత్‌పై ఏడు వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓడినప్పటికీ 3-2 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్ అంతటా నిలకడైన ప్రదర్శన కనబరిచిన కివీస్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకున్నాడు. ఇదే సమయంలో టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ రికార్డును ఫిలిప్స్ బ్రేక్ చేశాడు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో ఒకే ప్రత్యర్థి జట్టుపై అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా ఫిలిప్స్ కొత్త చరిత్ర సృష్టించాడు. 2026 సంవత్సరంలో భారత్‌పై ఫిలిప్స్ మొత్తం 522 పరుగులు సాధించాడు. ఈ జాబితాలో ఐదో మ్యాచ్ ముందు వరకు అభిషేక్ శర్మ (న్యూజిలాండ్‌పై 431 పరుగులు) అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం ఒక పరుగు చేసి పెవిలియన్ చేరాడు. మరోవైపు గ్లెన్ ఫిలిప్స్ 65 పరుగులతో చెలరేగి ఆడాడు. దీంతో అభిషేక్‌ను ఫిలిప్స్ దాటేశాడు. ఇక మూడో స్థానంలో సాహిబ్జాద్ ఫర్హాన్(పాకిస్థాన్) నిలిచాడు. మరోవైపు ఐదు మ్యాచుల సిరీస్‌లో భాగంగా ఆఖరి టీ20 మ్యాచ్‌లో ఓడినప్పటికీ భారత ఆటగాళ్లు పలు వ్యక్తిగత మైలురాళ్లను అందుకున్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. నవంబర్ 1న సెడాన్ పార్క్ వేదికగా జరిగిన ఐదో టీ20 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత ఓవర్లలో 191 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, కివీస్ బ్యాటర్లు టిమ్ సెఫర్ట్ (93 పరుగులు), గ్లెన్ ఫిలిప్స్ (65 పరుగులు) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో న్యూజిలాండ్ 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 18 ఓవర్లలోనే ఆ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.

ఒక క్యాలెండర్ ఇయర్‌లో

ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లు
522 గ్లెన్ ఫిలిప్స్-భారత్ (2026)
431 అభిషేక్ శర్మ-న్యూజిలాండ్ (2026)
398 సాహిబ్జాదా ఫర్హాన్-శ్రీలంక (2026)

చైనా డిక్టేటర్‌పై జోక్ ఎఫెక్ట్..
ఎంబాపెకు షాకిచ్చిన కంపెనీలు!

ఫ్రాన్స్ స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ కైలియన్ ఎంబాపె చేసిన ఓ సరదా వ్యాఖ్య ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో వివాదానికి దారితీసింది. చైనా మాజీ అధ్యక్షుడు మావో జెడాంగ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై చైనాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎంబాపె క్షమాపణలు చెప్పినప్పటికీ చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని టెలివిజన్ ఛానల్ సీసీటీవీలా లిగా మ్యాచ్‌ల ప్రసారాలను నిలిపివేసింది. ఆదివారం జరిగిన రియల్ మాడ్రిడ్ మ్యాచ్‌ను కూడా ప్రసారం చేయలేదు. చివరకు ఎంబాపెను బ్రాండ్ అంబాసి డర్‌గా తొలగిస్తూ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.

అసలేం జరిగిందంటే?

ఫ్రెంచ్ టాక్ షోలో పాల్గొన్న ఎంబాపె పాల్గొన్నాడు. అతడికి 'మీకు ఇష్టమైన మీమ్ ఏంటి?' అని వ్యాఖ్యాత అడిగారు. దానికి సమాధానం ఇస్తూ చైనాకు చెందిన మావోను పరోక్షంగా ప్రస్తావించాడు. 'ఆయన చైనాకు చెందిన డిక్టేటర్ అనుకుంటా' అని నవ్వుతూ చెప్పాడు. ఈ చిన్న క్లిప్ చైనాలో విపరీ తంగా వైరల్ అయింది. దీనికి స్పందించిన ఎంబాపె.. ఆ మరుసటి రోజే క్షమాపణలు చెప్పాడు. 'నా వ్యాఖ్య సరైనది కాదు. చైనాలోని ప్రజ లను నా మాటలు బాధించాయని ఇప్పుడు అర్థం చేసుకు న్నాను' అంటూ వివరణ ఇచ్చాడు. రియల్ మాడ్రిడ్ క్లబ్, లా లిగా కూడా క్షమాపణలు తెలిపాయి. అయితే అదే రోజు చైనాకు చెందిన డాంగ్‌పెంగ్, మెంగిన్యూ, మిల్క్‌గ్రౌండ్ తదితర కంపెనీలు ఎంబాపెతో భాగస్వామ్యాలను తెంచుకున్నాయి. జాతీయ సెంటి మెంట్‌ను గౌరవించని వారితో కలిసి పనిచేయలేమని స్పష్టం చేశాయి.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 3 నవంబరు 2026

నిధి చుట్టూ దెయ్యం కథ..




'ఎస్ఆర్ కల్యాణమండపం' చిత్రంతో దర్శకుడిగా ప్రతిభను చాటుకున్న శ్రీధర్ గాదె రూపొందిస్తున్న కొత్త చిత్రానికి 'కొరివి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో ఈశ్వర్ రాచి రాజు హీరోగా నందు మురళీధర్, నిఖిత హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై వెంకట్ తలారి నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్‌చేశారు మేకర్స్.మాయా నది ప్రాంతంలో ఉన్న నిధికి కాపుకాసే ఓ కొరివి దెయ్యం కథ ఇది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ యూనిక్ హారర్ మూవీని సరికొత్త కథా కథనాలతో తెరకెక్కిస్తున్నట్లుచిత్రబృందం తెలిపింది.

సత్యవాన్ సావిత్రి వచ్చేది ఎప్పుడంటే...



జాతీయ ఉత్తమ నటి కీర్తి సురేశ్ ఈ యేడాది వైవిధ్యభరితమైన పాత్రల తో అలరిస్తోంది. నేచురల్ స్టార్ నాని 'ది ప్యారడైజ్'లో ఐటమ్ సాంగ్‌లో నర్తించిన కీర్తి సురేశ్, ఆతర్వాత తమిళ చిత్రం'డోరతి'లో ప్రాధాన్యమున్న పాత్ర ను చేసింది. నిడివి తక్కువే అయినా కథంతా ఆమె చుట్టూనే తిరుగుతుంది. ఇక తాజాగా నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'అక్క'వెబ్ సీరిస్‌లో సీనియర్ నటి రాధికాఆప్టేతో కలిసి కీర్తి సురేశ్ స్క్రీన్ షేర్ చేసుకుంది. యశ్‌రాజ్ ఎంటర్‌టైన్ మెంట్స్ సంస్థ నిర్మించిన ఈ వెబ్ సీరిస్ ను ధర్మరాజ్ శెట్టి డైరెక్ట్ చేశారు.ఇందులో భవానీగా నటించింది కీర్తి సురేశ్. ఇక ఆమె లాయర్ పాత్ర ను పోషించిన 'సత్యవాన్ సావిత్రి' సినిమా నవంబరు 20వ తేదీ విడుదల కాబోతోంది. విశేషం ఏమంటే 'సత్యవాన్ సావిత్రి' పేరుతో గతంలో కమల్ హాసన్, శ్రీదేవి 1977లో ఓ మలయాళ చిత్రంలో నటించారు. అది అదే పేరుతో తమిళంలో డబ్ అయ్యింది. అలానే 'సత్య వంతుడు' పేరుతో తెలుగులో విడుదలైంది. ఇప్పు డు 'సత్యవాన్ సావిత్రి' పేరుతో కీర్తి సురేశ్ నటిస్తోంది మాత్రం సోషల్ మూవీనే. ప్రవీణ్ ఎస్.విజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మిస్కిన్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ నవంబరు 3న రాబోతోంది.

డ్రాగన్' కోసం 'ధురంధర్' మ్యూజిక్ డైరెక్టర్



సినిమా విజయంలో సంగీతానిది కీలక పాత్ర అన్నది నిజం. కథకు తగ్గ ట్టుగా పాటలు, సన్నివేశాలకు అనుగు ణంగా నేపథ్యసంగీతం అందించేందు కు దర్శకనిర్మాతలు ప్రత్యేక దృష్టి పెడు తున్నారు. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్న చిత్రం 'డ్రాగన్'. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ లూగర్ పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి తొలుత రవి బస్రూర్ సంగీత బాధ్యతలు తీసు కున్నారు.ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలకు ఆయనే సంగీతం అందించారు. అయితే తాజాగా కొన్ని పాటల కోసం 'ధురంధర్' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్ దేవ్‌ను కూడా తీసుకోవా లని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలి సింది. ఈ సినిమాలో పాటలతోపాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవా లనే ఉద్దేశంతోనే ఇద్దరు సంగీత దర్శ కుల సేవలను వినియోగించు కోవాలని చూస్తున్నట్లు సమాచారం. అయితే శాశ్వత్ సచ్‌దేవ్ భాగస్వామ్యంపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

రెండురోజుల్లో 'ఫౌజీ' సెట్స్‌లోకి డార్లింగ్!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారన్న విషయం తెలిసిందే. అందులోని మోస్ట్ అవేటెడ్ పీరియాడికల్ యాక్షన్ డ్రామా ఫౌజీ. టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కు తున్న ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పటి నుంచే ట్రేడ్ వర్గాలతో పాటు సినీ అభి మానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ బ్యానర్లు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇక ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సరసన అందాల భామ ఇమాన్వి కథా నాయికగా నటిస్తోంది.ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్లు, ఇటీవల వచ్చిన గ్లింప్స్ సోషల్ మీడియాను షేక్ చేయడమే కాకుండా, సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ క్రేజీ వార్త చక్కర్లు కొడుతోంది. అయితే, ఇటీవల బ్లాక్‌బస్టర్ హిట్ 'కల్కి' సీక్వెల్ షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అయిన ప్రభాస్.. తాజాగా మరోసారి తన దృష్టిని 'ఫౌజీ' సినిమాపై పెట్టారట. ఫిల్మ్ నగర్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. మరో రెండు రోజుల్లో డార్లింగ్ ప్రభాస్ 'ఫౌజీ' షూటింగ్‌లో తిరిగి పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తుది దశకు చేరుకున్న ఈ సినిమా షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభాస్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే షూటింగ్ పూర్తి చేసుకుని ప్రమోషన్స్ జోరు పెంచనున్నారట మేకర్స్. అయితే, దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఇక మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ.. కొన్ని కారణాల వల్ల ఆ తేదీని వాయిదా వేసిన విషయం తెలిసిందే. దీంతో వచ్చే ఏడాది మార్చి నెలలో 'ఫౌజీ'ని గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక అద్భుతమైన హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ దిగ్గజ నటులు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తితో పాటు అలనాటి దిగ్గజ నటి జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. ఆయన మ్యూజిక్ సినిమాకే హైలైట్‌గా నిలవ నుందని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. మొత్తానికి ప్రభాస్ నుంచి రాబోతున్న మరో విజువల్ వండర్ 'ఫౌజీ' అంటున్నా రు సినీ విశ్లేషకులు. మరి హను రాఘవ పూడి డైరెక్షన్‌లో ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, ఈ పీరియాడికల్ కథ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

కోలీవుడ్‌లో మల్టీస్టారర్ సినిమా



కోలీవుడ్‌తో పాటు పాన్-ఇండియా వ్యాప్తంగా సంచలనం సృష్టించేందుకు ఒక అరుదైన కాంబినేషన్ రూపుదిద్దు కుంటోంది. కోలీవుడ్ స్టార్ హీరోలు ఇద్దరు ఒకే స్క్రీన్‌పై కనిపించ నున్నారు. ఈ భారీ మల్టీస్టారర్‌కి దిగ్గజ దర్శకుడు మణిరత్నం దర్శకత్వం వహించడంతో తమిళ్ ఇండస్ట్రీతో పాటు టాలీవుడ్ కూడా ఈ సినిమా వైపు తొంగిచూస్తోంది. ఆ స్టార్ హీరోలు ఎవరో కాదు.. వర్సటైల్ స్టార్స్ సూర్య,ధనుష్. ఈ కాంబో గురించి వింటూనే గూస్ బంప్స్ వస్తున్నాయని తమిళ తంబీలు సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఒకప్పుడు కల్ట్ సినిమాలను తెరకెక్కించిన మణిరత్నం ఈ మధ్యకాలంలో ఒక్క మంచి హిట్‌ని కూడా అందుకోలేకపోయాడు. అప్పుడెప్పుడో బాహుబలి రేంజ్‌లో పొన్నియన్ సెల్వన్‌ని తెరకెక్కించాడు. ఆసినిమా తెలుగు వారికే కాదు తమిళ్ వాళ్ళకు కూడా అంతగా ఎక్కలేదు. ఇక ఈ సినిమా తరువాత కమల్ హాసన్‌తో థగ్‌లైఫ్‌ని తెరకెక్కించా డు. ఇక ఈ సినిమా గురించి ఎంత తక్కువ చెప్పు కుంటే అంత మంచిది. ఒకప్పుడు ఎలాంటి సినిమాలు తీసిన డైరెక్టర్.. ఇప్పుడు ఎలాంటి సినిమాలు తీస్తున్నాడు అంటూ నెటిజన్స్ ఆయన గురించి కామెంట్స్ చేశారు. అయితే ఈసారి కచ్చితంగా హిట్ ట్రాక్ ఎక్కాలని మణిరత్నం తనకు అచ్చివచ్చిన లవ్ స్టోరీతో రాబోతున్నాడు. విజయ్ సేతుపతి, సాయి పల్లవి జంటగా మణిరత్నం దర్శక త్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ఇంజి వెల్లమ్. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరిలో విడుదల కానుంది. ఇక దీని తరువాత మణిరత్నం.. సూర్య-ధనుష్‌ల తో ఒక పవర్‌ఫుల్ టూ-హీరో స్క్రిప్ట్‌ను ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన ఈ కథకు సంబంధించి సూర్య, ధనుష్ ఇద్దరినీ సంప్రదించారని, వారు కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపించినట్లు తెలిసింది. ప్రస్తుతం రెమ్యూనరేషన్, డేట్స్, షూటింగ్ షెడ్యూల్స్‌కు సంబంధిం చిన చర్చలు జరుగుతున్నా యని, ఇవన్నీ అనుకూలిస్తే త్వరలోనే ఈ క్రేజీ మల్టీస్టారర్‌పై అధికారిక ప్రకటన వెలువడనుంది. ఈ వార్త వినగానే నెటిజన్స్.. ఇది కూడా పొన్నియన్ సెల్వన్ లా అయితే అవ్వదు కదా అని కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.

రానా, కంగనా, రవిబాబు మూవీ టైటిల్ ఏంటంటే?

సౌత్, నార్త్ సినీ పరిశ్రమల్లో ఎప్పుడూ వైవిధ్యమైన ప్రాజెక్టులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే భళ్లాలదేవ రానా దగ్గుబాటి, బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్, టాలీవుడ్ విలక్షణ దర్శకుడు రవిబాబు కలయికలో ఓ అనూహ్యమైన,క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. హాలోవీన్ సందర్భంగా న్యూఢిల్లీ లో ఘనంగా నిర్వ హించిన 'హారర్‌కాన్ ఇండియా 2026' వేదికగా రానా దగ్గుబాటి స్వయంగా ఈ సర్‌ప్రైజింగ్ ప్రాజెక్ట్‌ను అధికారి కంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్కేరీ పిక్చర్' అనే ఆసక్తి కరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ వేదికపై రానా మాట్లాడుతూ "ఇదొక పూర్తిస్థాయి హారర్‌చిత్రం. నా స్నేహితుడు, టాలీవుడ్ ప్రముఖ నటుడు-దర్శకుడు రవిబాబు దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన తెలుగులో ఎన్నో అద్భుతమైన సస్పెన్స్, హారర్ చిత్రాలు తీశారు. దర్శ కుడిగా హిందీలో ఆయనకు ఇదే తొలి చిత్రం. ఈ సినిమా టైటిల్‌ను నార్త్ మీడి యాకు కూడా ఇవ్వకుండా నేరుగా ఇక్కడే తొలిసారి రివీల్ చేస్తున్నాం" అని వెల్లడించారు. ఈ చిత్రం లో కంగనా రనౌత్ ప్రధాన పాత్ర పోషించనుండగా, వేదికపై రానా అనౌన్స్ చేసిన వీడియోను కంగనా తన ఇన్‌స్టాగ్రామ్‌లో రీపోస్ట్ చేస్తూ ప్రాజెక్ట్‌ను ధ్రువీకరించారు.

